

## సోమశిలలో 16.764 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 29: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, గురువారం నాటికి జలాశయంలో 16.764 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి, నారాయణ తదితరులు

# వైసీపీ కోటకు బీటలు

- వీపీఆర్ వెంట టీడీపీలోకి భారీగా వలసలు
- ఉమ్మడి జిల్లాపై వేమిరెడ్డి ప్రభావం
- రేపే అరుదైన ఘట్టం ఆవిష్కరణ ?

నెల్లూరు, ఫిబ్రవరి29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ నిట్టనిలువునా చీలనున్నది. కుట్ర పూరిత రాజకీయాలను తట్టుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) భారీ స్థాయిలో ఆ పార్టీ నాయకులను తనవెంట తీసుకెళుతున్నారు. వీపీఆర్‌ను కేవలం ఓ ఆర్థికశక్తిగా మాత్రమే చూసిన వైసీపీ పెద్దలు, అందుకు తగిన మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోంది. వీపీఆర్ వెంట నడవటానికి సిద్ధపడిన నాయకులను చూసి కళ్లు తేలేయడంతప్ప ఏమి చేయలేకపోతున్నారు. కందుకూరు నియోజకవర్గంతో కూడిన ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి వందలాది మంది వైసీపీ నాయకులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడానికి సన్నద్ధమయ్యారు. మార్చి 2న సింహపురి రాజకీయ చరిత్రలో ఓ అరుదైన ఘట్టంగా మారనున్నదని టీడీపీ వర్గాలు అంటున్నాయి. దీన్ని బట్టి చూస్తే టీడీపీలోకి చేరికల సంఖ్య ఎంత ఉండబోతున్నది అర్థమవుతోంది.

### ఒక్కరి వల్ల ఎంత జరిగింది ?

ఒక్కరి వల్ల జిల్లా మొత్తం నాశనం అయింది. కుట్రపన్ని వీపీఆర్‌ను పార్టీ నుంచి సాగనంపారు. ఇందుకు కారణమైన ఆ నాయకుడిని, ఆయన్ను వెనకేసు కొచ్చిన వైసీపీ అగ్రనాయకులను ఉద్దేశించి జిల్లాకు చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు అన్నమాటలివి. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఆ నాయ కుడు అన్న మాటల్లో నిజమెంతో తెలుస్తోంది. వీపీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు.. వీపీఆర్ వైసీపీకి రాజీనామా చేసిన మరుసటి రోజు నుంచే ఇందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ వైసీపీకి చెందిన కీలక నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, సూళ్లూరుపేట, గూడూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి పలువురు కీలక నాయకులు మార్చి 2న టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ చేరికలతో టీడీపీ మరింత బలపడ టంతో పాటు వైసీపీ కోటకు బీటలు వారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### రేపు వీపీఆర్ టీడీపీలో చేరిక

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి 2వ తేదీన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతోపాటు ఆయన అనుచరులు భారీ సంఖ్యలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరనున్నారని మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు వెల్లడించారు. చంద్రబాబు రాక సందర్భంగా నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాట్లను వేమిరెడ్డి, నారాయణ, అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ, అజీజ్‌లు మీడియాతో మాట్లాడారు. మంచితనానికి మారుపేరు, హుందా రాజకీయాలు చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి వారే వైసీపీలో ఇమడలేకపోయారంటే ఆ పార్టీ తీరు, జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వైసీపీ అరాచక, నియంతృత్వ ధోరణితో అనేక మంది ఆ పార్టీ నుంచి బయటకొస్తున్నారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలనే కాదని, తన వెంటన నడిచే నాయకులు, కార్యకర్తలను కూడా మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు తామంతా వీపీఆర్‌ను టీడీపీలోకి ఆహ్వానించగా ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. వీపీఆర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్‌లు, మండల, జిల్లా స్థాయి నేతలు వేలాదిగా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొనే చంద్రబాబు జిల్లాకు వస్తున్నారని వెల్లడించారు. టీడీపీ శ్రేణులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్, తదితరులు

## 5 నుంచి శంఖారావం

- లోకేష్ పర్యటన ఖరారు
- ఉమ్మడి జిల్లాలో సభలు

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'శంఖారావం' కార్యక్రమం మార్చి 5వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నది. మూడురోజుల పాటు లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆరు నియోజకవర్గాల్లో 'శంఖారావం' సభలను నిర్వహించనున్నారు. 5వతేదీ ఉదయం కందుకూరు, సాయంత్రం ఉదయగిరి నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. 6వ తేదీన ఉదయం కావలి, మధ్యాహ్నం కోవూరు, సాయంత్రం నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో సభలు నిర్వహించనున్నారు. 7వ తేదీన ఉదయం సర్వేపల్లి, మధ్యాహ్నం గూడూరు, సాయంత్రం వెంకటగిరి నియోజకవర్గాల్లో 'శంఖారావం' సభా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఆక్రమణలకు అంతేది ?



నెల్లూరు రైల్వేస్టేషన్ ఎదురుగా సర్వేపల్లి కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసిన నర్సరీ

- నెల్లూరులో ఇరిగేషన్ స్థలాల కబ్జా
- రూపుకోల్పోతున్న నీటిపారుదల కాలువలు
- వైసీపీ నేతలకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది సహకారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- ప్రమాదంలోకి నగరం

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ నాయకులు ఇరిగేషన్ ఆస్తులను అమ్మేస్తుంటే, వారికి ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారు. భవిష్యత్ ఏమిటన్న ఆలోచన వారిలో కొంచెం కూడా కనిపించడం లేదు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా అటు వైసీపీ నాయకులు, ఇటు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలకు అండగా నిలుస్తూ, రూ.కోట్లు జేబుల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడంలేదు. ఇలాగే కొనసాగితే నెల్లూరు నగరం ప్రమాదంలోకి జారుకోనున్నది.

### కొన్నింటిని పరిశీలిస్తే....

- ఆధునికీకరణ పేరుతో సర్వేపల్లి కాలువను కుదించారు. అప్పటికే ఆక్రమణలకు గురైన ఈ కాలువ, ఆధునికీకరణ తర్వాత మరింత స్థలం మిగలడంతో యథేచ్ఛగా అక్కడ తిష్ఠ వేశారు. కాలువ స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు చేయకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా మినీబైపాస్ వెంబడి సర్వేపల్లి కాలువ అంచున భవనాలు నిర్మిస్తున్నారు. దుకాణాలు, నర్సరీల ఏర్పాటుకు వైసీపీ నాయకులే ఈ స్థలాలను లీజుకు ఇచ్చారు. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు ప్రతి నెలా ఈ వ్యాపారుల వద్ద నుంచి లీజు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసం ఎదురు గానే ఆక్రమణలు జరుగుతుండడం గమనార్హం.
- కృష్ణపట్నం కాలువ వెంబడి కూడా అదే పరిస్థితి. అక్కడ కూడా నర్సరీలు, దుకాణాల ఏర్పాటు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ ఈ కాలువ స్థలాలను ఏకంగా అమ్మేస్తుండడం గమనార్హం. ఈ వ్యాపారాల మూలంగా ఆ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోయారు.



మినీ బైపాస్‌లో ఆదాల ఇంటి ఎదురుగా ఉన్న నర్సరీ

- నెల్లూరు చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ వస్తున్నారు. కొన్నేళ్ల నుంచి జరుగుతున్న ఆక్రమణలతో ఇప్పటికే చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఇప్పటికే చెరువులో అనేక ఇళ్లు వెలిశాయి. ఇంకా కూడా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. 33వ డివిజన్ వెంగళరావునగర్ ప్రాంతంలో ప్రస్తుతం కొంతమంది ఆక్రమణదారులు చెరువును పూడుస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. తొమ్మిది అంకణాల చొప్పున ప్లాట్లుగా విభజించి ఒక్కో ప్లాటును రూ.3 నుంచి రూ.5 లక్షలకు అమ్మేస్తున్నారు.
- నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో కాలువను పూడ్చేసి ఏకంగా మూడంతస్థుల నిర్మాణాన్ని చేస్తున్నారు. పక్కన కాలువను పూడ్చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై ఇరిగేషన్ అధికారులతోపాటు స్పందనలో కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. కానీ మూడు నెలల నుంచి సర్వే కూడా చేయలేని దుస్థితిలో యంత్రాంగం ఉంది. కాలువపై నిర్మాణానికి మున్సిపల్ అధికారులు జీప్లస్‌టు రెసిడెన్షియల్‌కు అప్రూవల్ కూడా ఇచ్చేశారు. మొదట పనులు ఆపిన ఇరిగేషన్ సిబ్బంది ఆ తర్వాత పట్టించుకోలేదు. ఈ భవనం జోలికి రాకుండా ఇరిగేషన్ సిబ్బందికి రూ.10 లక్షలు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.
- శ్రీహరినగర్‌లో రామిరెడ్డి కాలువను ఆక్రమించి ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆఫీసు నిర్మించారు. ఆ పక్కనే మరో మూడంతస్థుల భవన నిర్మాణం ప్రారంభమైంది. కొండాయపాలెం సాయిబాబా ఆలయం వెనుక వైపు ఓ వ్యక్తి కాలువను పూడుస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని ఏకంగా కాలువ భూమికి రిజిస్ట్రేషన్ కూడా చేసే శారు. దీనిపై గతంలోనే ఇరిగేషన్ సిబ్బంది సర్వే చేసి ఆక్రమ ణలు తేల్చి వదిలేశారు. మద్రాసు బస్టాండ్ సమీపంలో ఓ హోటల్ పార్కింగ్ కోసం ఏకంగా కాలువ స్థలాన్ని ఆక్రమించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆక్రమ ణలు ఉన్నాయి. ఇలానే కొనసాగితే భవి ష్యత్‌లో నెల్లూరు నగరం ప్రమాదంలోకి జారుకునే అవకాశం ఉంది.

### కనిపించని కాలువలు

జిల్లా పాలనా కేంద్రమైన నెల్లూరు నగరంలో ఏ ఒక్క కాలువ కూడా సరిగా లేదు. అన్ని కాలువలు ఆక్రమణలకు గురై రూపుకోల్పోయాయి. దీంతో చిన్న వర్షం కురిసినా ప్రధాన ప్రాంతాలన్ని నీటిలో మునిగిపోతున్నాయి. ఓ వైపు పెనుప్రమాదం హెచ్చరిస్తున్నా పాలకులకు గానీ అధికారులకు గానీ పట్టించుకోవడం లేదు. నడిరోడ్డుపై కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా ఎవరికీ కనిపించడం లేదు. స్థానికులు ఇదేమిటని ప్రశ్నిస్తుంటే వారిపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో వారు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారేకానీ ఫలితం ఉండడం లేదు. ఎవరో ఒకవ్యక్తి స్వలాభం కోసం కాలువను ఆక్రమించి మూసేస్తే ఆ ప్రభావం లక్షలమందిపై పడుతోంది. చివరకు ప్రజలే రోడ్లపైకి వచ్చి ఆక్రమణలను అడ్డుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు ఇరిగేషన్ స్థలాలను వారిసొంత స్థలాల్లాగా వ్యాపారులకు లీజుకు ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల వైసీపీ నాయకులే ఆక్రమణలకు తెగబడుతున్నారు. వీరి జోలికి వెళ్లడానికి సాహసించలేని ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది, ఇదే తడవుగా అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. పైపెచ్చు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటే కార్పొరేషన్ సిబ్బంది కూడా పట్టించుకోరు. పైగా ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులు కూడా మంజూరు చేస్తుండడం కొసమెరుపు.

# బుర్రాపై గుర్రు

- మధుకు సహకరించనని తేల్చిచెప్పిన మహీధర్
- ఫొటో వాడుకుంటామన్నా అంగీకరించని వైనం
- ఎమ్మెల్యేతో వీపీఆర్ భేటీ
- టీడీపీలోకి రావాలని ఆహ్వానం
- శరవేగంగా మారుతున్న కందుకూరు రాజకీయాలు



మాచవరంలో కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిసి వెళ్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 29: కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు సహకరించలేనని సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఉదయం బుర్రా ఆయన్ను కలవగా ఈ మేరకు తేల్చిచెప్పారు. కాగా సాయంత్రం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాచవరం వచ్చి ఎమ్మెల్యే మహీధరరెడ్డితో చర్చలు జరిపారు. చర్చల సారాంశం తెలియకపోయినా మహీధరరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానించేందుకే వీపీఆర్ వచ్చాడనేది సుస్పష్టం. వేమిరెడ్డితో సన్నిహిత సత్సంబంధాలు ఉన్న మహీధరరెడ్డి కూడా ఆయన అభిప్రాయానికి తగిన గౌరవం ఇచ్చే అవకాశాలే బలంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఇద్దరు ఇన్‌చార్జిల మార్పు

నియోజకవర్గంలో బలమైన వర్గం, అనుచరగణం ఉన్న సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి ఉద్దేశపూర్వకంగా టికెట్ ఇవ్వకుండా వైసీపీ పక్కన పెట్టింది. పదిహేనురోజుల్లోనే ఇద్దరు ఇన్‌చార్జులను మార్చింది. మొదట ప్రకటించిన అరవింద పోటీకి విముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బుర్రా మధుసూదన్ పేరును ప్రకటించారు. ఆ వెంటనే బుర్రా మాచవరం చేరుకుని ఎమ్మెల్యేని కలిసి సహకారం కోరారు. అందుకు మహీధర్‌రెడ్డి ససేమిరా అన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మరోదఫా బుర్రా తన అనుచరులతో కలిసి మహీధరరెడ్డిని కందుకూరులోని ఆయన కార్యాలయంలో మళ్లీ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాను సహకరించేది లేదని బహిరంగంగానే బుర్రాకు స్పష్టం చేశారు. గంటన్నర పాటు బుర్రా ఎమ్మెల్యే కార్యాలయంలో ఉండగా శాలువాతో సత్కరించి పంపించాడే కానీ, సహకారం మాత్రం కుదిరేపని కాదని చెప్పేశాడు. సరే మీరు నావెంట రాకున్నా నాయకులకు ఫోన్లు చేసి చెప్పండని కోరగా, అవన్ని అయ్యేపనులు కాదు, నాయకుల ఫోన్ నెంబర్లదేముంది ఎవరిని అడిగితే చెప్పరు..? మీరే తెలుసుకోండి.. అని అన్నారు. ప్రచారంలో మీ ఫొటో అయినా వాడుకుంటానని బుర్రా కోరినా కుదరనే కుదరదు నా ఫొటో ఎందుకు జగన్మోహనరెడ్డి ఫొటో పెద్దది వేసుకో.. మాకు ఓట్లు ఎక్కడున్నాయి, ఆయన ఫొటోచూస్తేనే ఓట్లన్నీ పడతాయని ఎమ్మెల్యే అన్నారు. దీంతో బుర్రా వెనుదిరిగి వెళ్లిపోయారు.

### వీపీఆర్ భేటీ

కాగా గురువారం సాయంత్రం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాచవరంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఏకాంతంగా చర్చలు జరిపారు. గంటకుపైగా వారిద్దరు చర్చించుకున్నారు. చర్చల సారాంశం తెలియనప్పటికీ మహీధరరెడ్డిని టీడీపీలోకి రావాల్సిందిగా వేమిరెడ్డి ఆహ్వానించినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై కేడర్‌తో చర్చించి మహీధరరెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 81 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతి
- ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 : ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20వతేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. ఇందుకోసం జిల్లాలో 81 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో హాల్‌టికెట్ తీసుకోని విద్యార్థులు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవాలి, హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా కూడా అనుమతి ఇస్తామని ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ నెంబరు 0861-2320312ను ఏర్పాటు చేశామని చెప్పారు.

### 52,076 మంది విద్యార్థుల హాజరు

ఇంటర్ పరీక్షలకు 52,076 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్ 25,202, ఒకేషనల్ 1,217 కలిపి 26,419 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ 24,243, ఒకేషనల్ 1,414 కలికి మొత్తం 25,657 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని వివరించారు. చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి సెంటర్లలో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఐదుగురు సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీరితోపాటు 81 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. వీరితోపాటు డీఈసీ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఆర్ఐవో శ్రీనివాసులు మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలియచేయాలన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

బిట్రగుంట, ఫిబ్రవరి 29: స్థానిక రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం బిట్రగుంట బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విజయవాడ రైల్వే సీనియర్ డీపీవో ఆనంద్, డివిజనల్ సంఘ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు క్రీడలు ఉత్సాహంతోపాటు ఆరోగ్యానిస్తాయని అన్నారు. తుని నుంచి గూడూరు స్టేషన్ల వరకు ఉన్న రైల్వేలోని వివిధ శాఖల కార్మికులకు ఏడు రోజులపాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిట్రగుంట సంఘ్ చైర్మన్ పీ గోవిందరాజు, ఏడీఎస్ జీ శ్రీనివాసులు, జీవన్‌కుమార్లను వారు అభినందించారు. మొదట జరిగిన మ్యాచ్‌లో గూడూరు జట్టుపై బిట్రగుంట ఎలక్ట్రికల్ జట్టు విజయం సాధించింది. కొత్త క్రికెట్ క్రీడామైదానంలో జరిగిన పోటీలో బిట్రగుంట రన్నింగ్ బ్యాచ్ ఇంజనీరింగ్ జట్టుపై విజయం సాదించింది. మధ్యాహ్నం విజయవాడ బీఆర్‌ఐపై చిన్నగంజాం జట్టు గెలుపొందింది, నెల్లూరు కమర్షల్ శాఖపై బిట్రగుంట లోకో డిపార్ట్‌మెంట్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే వైద్యులు సుధాకర్, వర్కింగ్ కమిటీ సభ్యులు డేగా శ్రీనివాసులు, స్టేష న్ మాస్టర్లు ఎల్వీ మీనాకుమార్, మురళీరెడ్డి, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, రైల్వే కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లా డుతున్న రైల్వే సీనియర్ డీపీవో కట్టా ఆనంద్



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

# ధరల పెంపుపై నిరసన

- నల్లదుస్తులు ధరించి తెలుగు మహిళల ప్రదర్శన
- వైసీపీ పాలనపై కన్నెర్ర

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 29 : వైసీపీ పాలనపై నెల్లూరు నగరంలో మహిళలు కన్నెర్ర చేశారు. గురువారం నల్లదుస్తులు ధరించిన మహిళలు గాంధీబొమ్మ నుంచి ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నేత నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన స్టోన్‌హౌస్‌పేటలోని జలకన్య విగ్రహం వరకు కొనసాగింది. ఫ్లకార్డులు చేతబట్టిన మహిళలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ అరాచకాలపైనా, నిత్యావసరాల పెంపునకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధూర మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై రాష్ట్రవ్యాప్తంగా నల్లదుస్తులు ధరించి మహిళలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారన్నారు. నెల్లూరు పురవీధుల్లో మునుపెన్నడూ లేని విధంగా నల్లచీరలు ధరించి ప్రభుత్వ తీరుకు నిరసన తెలపటం చూస్తుంటే ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తున్నదన్నారు. వైసీపీ పాలనలో నిత్యావసరాలు, కరెంటు బిల్లులు, ఆర్టీసీ చార్జీలు, వంటగ్యాస్ రేట్లను విపరీతంగా పెంచేశారని విమర్శించారు. ఆఖరికి చేతకాని పాలన వల్ల చెత్తపై కూడా పన్ను వేయటం దారుణమన్నారు. ఈకార్యక్రమంలో నగర టీడీపీ మహిళా నేతలు రేవతి, విజయమ్మ, జానకి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మహిళా నేతలు

# ఆగని అదనపు వసూళ్లు

- అప్పారావుపాళెం ఇసుకు రీచ్‌లో బాట పేరిట బాదుడు
- ట్రాక్టరుకు రూ.500, టిప్పరుకు రూ.1000 వసూలు
- అధికారులకు తెలియకుండానే జరుగుతుందా ?
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు




అప్పారావుపాలెం ఇసుకరీచ్‌లో అదనపు వసూళ్లకు బిల్లు

**చేజర్ల, ఫిబ్రవరి 29:** అసలే ట్రాక్టరు ఇసుక కొనాలంటేనే నానా తంటాలు పడుతున్న సామాన్య ప్రజలకు ప్రస్తుతం రీచ్‌లలో చేస్తున్న అదనపు వసూళ్లతో మూలిగే నక్కపై తాటికాయి పడ్డట్లైంది సామాన్య ప్రజల పరిస్థితి. మండలంలోని ప్రజలకు చెంతనే ఇసుక ఉన్నా ట్రాక్టరు ఇసుక కావాలంటే రూ.3వేలకు పైగా వెచ్చించాల్సిన పరిస్థితి ఉందని గృహనిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. గతంలో కోటితీర్థం, పెరుమాళ్ళపాడు, మాముడూరు గ్రామా లలో ఇసుక రీచ్‌లు ఉండేవి. ప్రస్తుతం వీటికి అను మతులు ఇవ్వకపోవడంతో మండల సమీపంలోని ఆత్మకూరులో అప్పారావుపాళెంలో ఇసుకరీచ్‌ను ఏర్పా టు చేశారు. మొదట్లో జేపీ కంపెనీ వారి పేరుతో ఇసుక బిల్లులు ఇస్తుండగా, ప్రస్తుతం ప్రతిమా ఇన్‌ఫ్రాస్టక్చర్ పేరులో బిల్లులు ఇస్తున్నారు. గతంలో ఎటువంటి దారి ఖర్చులు వసూలు చేయలేదు. అయితే ప్రస్తుతం రీచ్‌లో దారి ఖర్చుల నిర్వహణ పేరుతో ట్రాక్టరుకు రూ.500, టిప్పరుకు రూ.1000, లారీలకైతే టైర్లు పెరిగే కొద్దీ వాళ్ళ ఇష్టానుసారంగా అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే రీచ్‌లో బాటవేయడానికి అంటూ అక్కడ ఉన్న సిబ్బంది బదులిస్తున్నారు. ఓపిక పట్టలేక గట్టిగా ప్రశ్నిస్తే లోడింగ్ సమయంలో ట్రక్కులో ఇసుక తక్కువ పోస్తూ వేధిస్తున్నారని ట్రక్కు యజమానులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అదనపు వసూళ్లపై చర్యలు తీసుకుంటారా ?**

అప్పారావుపాలెంలోని ఇసుక రీచ్‌కు నిత్యం పదుల సంఖ్యలో ఇసుక కోసం వాహనాలకు వస్తూ పోతుంటాయి. ప్రస్తుతం వసూలు చేస్తున్న అదనపు సొమ్ము రోజుకు లక్షలో వస్తుందని సమాచారం. అయితే ఈ అదనపు వసూలు అధికారులకు తెలియకుండానే జరుగుతుందా అన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అసలు అదనపు వసూలుకు అనుమతులు ఉన్నాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు ఇందులో వాటాలు ఉన్నట్లు కొంతమంది పేర్కొంటున్నారు. అదనపు వసూలుపై అధికారులు చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# సంక్షేమానికి చెల్లుచీటి

- భవన నిర్మాణ కార్మికులకు పథకాల రద్దు
- 1214 మెమో జారీ చేసిన ప్రభుత్వం
- అవస్థల్లో వర్కర్లు, పట్టించుకోని పాలకులు
- పాత విధానం అమలుకు డిమాండ్

**సంగం, ఫిబ్రవరి 29:** కార్మికుల్లో అధిక భాగం ఉంటున్న భవన నిర్మాణరంగ కార్మికుల పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతోంది. వారి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది. మెమో నెంబరు 1214 జారీ చేయడం ద్వారా గతంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేసింది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.

**సంక్షేమ నిధి ఉన్నా...**

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థికసాయం అందించేందుకు వెల్ఫేర్ ఫండ్(సంక్షేమ నిధి) ఉన్నా వారికి అందడంలేదు. ఫలితంగా వారు ఆందోళన చెందుతున్నారు. కార్మికులు పనిచేసే సమయంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటి సమయంలో సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. పనిచేసేటప్పుడు కార్మికుడు మరణిస్తే గత ప్రభుత్వం రూ. 6 లక్షలు చెల్లించేది. సహజ మరణానికి రూ. 2 లక్షలు ఇచ్చేది. అంతేకాక వివాహ కానుక, ప్రసవ కానుక, వృత్తి పరమైన పనిముట్లు కొనుగోలుకు ఆర్థిక సాయం చేసేది. ప్రస్తుత ప్రభుత్వం నవరత్నాల పేరుతో అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేసింది.



పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

**లక్షకుపైగా కార్మికులు**

జిల్లాలో సుమారు లక్షమంది వరకు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వారికి నవరత్న పథకాల్లో భాగంగా వైఎస్ఆర్ బీమా వర్తించాలంటే కుటుంబ పెద్ద మరణించాలి. కానీ గతంలో కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పరిహారం రావాలంటే కుటుంబ పెద్దకాకపోయినా ప్రమాదంలో ఎవరు చనిపోయినా పరిహారం వచ్చేది. ఇప్పుడు ఈ సాయాన్ని నిలిపివేసింది. వైఎస్ఆర్ వివా హ కానుక పేరుతో ఇంతకుముందు అమ లవుతున్న వివాహ కానుకను రద్దు చేసిం ది. వైఎస్ఆర్ వివాహ కానుక కింద కచ్చితంగా అమ్మాయి పదో తరగతి చదివి ఉండాలి. అదే భవన నిర్మాణ బోర్డులో అయితే అలాంటి నిబంధన ఏమీ లేదు. నవరత్నాల్లో సహజ మరణానికి ఎలాంటి నష్టపరిహారం లేదు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి పాలైనా కూడా వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎలాంటి జీవన భృతి అందడం లేదు.

**వెల్ఫేర్ బోర్డు రద్దు**

వైసీపీ అధికారంలోకి వచ్చాక 1214 నెంబరుతో మెమో తీసుకొచ్చింది. ఈ మెమోతో కార్మికుల వెల్ఫేర్ బోర్డు రద్దయింది. కాగా పాత విధానాన్నే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు. 1214 నెంబరు మెమోను రద్దు చేయాలని వారు కోరుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

**పాత విధానం అమలు చేయాలి**



భవన నిర్మాణ కార్మికులకు గత టీడీపీ ప్రభుత్వంలో వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలి. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన 1214 మెమోను రద్దు చేయాలి. కార్మికులకు పాత విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉండేది.

- మల్లికార్జున, తాపీమేస్త్రి, సంగం



కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల సమాఖ్య నాయకులు

## మద్దతు ధర కల్పించాలి.. జీఎస్టీ తొలగించాలి

- సీఐఎఫ్ఏ వినతి

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 :** వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు తదితరాలపై జీఎస్టీని తొలగించాలని రైతు సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టరేట్ ఏవోకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 7వతేదీ వరకు ఢిల్లీ ఏపీ భవన్‌లో కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్(సీఐఎఫ్ఏ) ఆధ్వర్యంలో వ్యవసాయ వర్క్‌షాపు జరిగిందని, అందులో చేసిన తీర్మానాలను అన్ని రాజకీయ పార్టీలకు పంపుతున్నామని చెప్పారు. వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి వ్యవసాయ రంగానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని 80శాతం వ్యవసాయ పను లకు వినియోగించాలని, ఎగుమతి నిషేధాన్ని ఎత్తివేయాలని, పంటల బీమా కంపెనీలను రైతులే నిర్ణయించుకునేలా అవకాశం కల్పించాల ని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, నాయకులు ఏవీఆర్ నాయుడు, ఎం మాలకొండారెడ్డి, పీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల విధులపై దృష్టి పెట్టండి

- నోడల్ అధికారుల సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్



నోడల్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

**నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 29 :** రానున్న ఎన్నికల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులు ఇకపై పూర్తి స్థాయిలో ఎన్నికల విధులపై దృష్టి పెట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. గురువారం తిక్కన ప్రాంగణంలో ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. అధికారులు చేయవలసిన పనుల చెక్ లిస్టు తయారు చేసుకుని వాటికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల సమాచారం, సమస్యలను వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం పలు రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష జరిపారు. 1500 ఓట్లు మించిన పోలింగ్ బూత్‌ల ను రెండుగా విభజించి 750 ఓట్లు ఉండేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. ఓటరు స్లిప్పులు జారీ చేయడంలో, పంచడంలో గందరగోళ పరిస్థితులు లేకుండా చర్యలు చేపట్టాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఏవో శర్మ పలువురు తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన**

**కావలి:** ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ గురువారం కావలి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి పరిశీలన చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చే ప్రాంతం, ఈవీఎంలు ఉంచే ప్రాంతం, ఎన్నికల అనంతరం ఈవీఎంల కలెక్షన్ పాయింట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఉదయగిరి రోడ్డులోని వెక్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్నే ఎన్నికలకు సంబంధించిన అన్ని విధులకు వినియోగించనుండటంతో దానిని పరిశీలించా రు. కావలి అసెంబ్లీ సెగ్మెంట్ మ్యాప్‌ను పరిశీలించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రతలు, అమలు చేయాల్సిన విధివిధానాలను కావలి సెగ్మెంట్ ఎన్నికల అధికారైన ఆర్డీవో శీనా నాయక్‌కు వివరించారు.

**ఈవీఎం గోదాములను శుభ్రంగా ఉంచండి : కలెక్టర్**

**నెల్లూరు (వెంకటేశ్వరపురం) :** ఈవీఎం గోదాముల్లో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని తొలగించి గదులను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ఆవర ణలోని ఈవీఎం గోదాములను ఆయన పరిశీలించారు. ఎన్నిక లు ముగిసిన తరువాత అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల వారీగా ఈవీఎంలను భద్రపరిచేందుకు వీలుగా కంపార్ట్‌మెంట్లు ఏర్పా టు చేయాలని సూచించారు. బందోబస్తుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మలోల, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీడీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి

- ఐఎంఎల్ డిపో వద్ద కార్మికుల అర్ధనగ్న నిరసన



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 29 :** ఎగుమతి కూలి, గ్రూప్ ఇన్సూరెన్స్, యూనిఫాం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎంఎల్ డిపో వద్ద కార్మికులు గురువారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు, సీఐటీయూ నేత అల్లాడి గోపాల్ మాట్లాడుతూ కూలి రేట్లు పెంచుతామని హామీ ఇచ్చిన మేరకు ఒప్పందం గడువు దాటి మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు నూతన రేట్లను బోర్డు ఆమోదించలేదని ఆరోపించారు. గ్రూప్ ఇన్సూరెన్స్‌పైనా ఇలాంటి సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, కోటేశ్వరరావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 145 |
| లేయర్ లైవ్ | 70 |
| స్కిన్ చికెన్ | 250 |
| స్కిన్‌లెస్ | 280 |
| లేయర్ | 120 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 5940 |
| వెండి కిలో ధర | రూ. 71,500 |
| వెండి ఒక గ్రాము | రూ. 73.50 |

## సైకిల్ యాత్రికుడు చైతన్యకు సత్కారం

**బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 29:** పర్యావరణ పరిరక్షణ కోసం 400 రోజుల పాటు దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టి ప్రజలను చైతన్యపరచిన బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గుర్రం చైతన్యను గురువారం జొన్నవాడ ఆలయంలో ఆలయ ఈవో వి గిరికృష్ణ సత్కరించి కామాక్షితాయి చిత్రపటాన్ని బహూకరించారు. చైతన్య 2022 డిసెంబరు 25న చేపట్టిన సైకిల్ యాత్ర ఈ ఏడాది జనవరి 26 తో ముగిసింది. ఈసందర్భంగా జొన్నవాడ ఆలయానికి వచ్చిన చైతన్యకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే కెనడాలో ప్రముఖ రన్నర్‌గా పేరుగాంచిన కెనడా వాసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

# అమ్మకానికి ఇనాం భూములు

- రెండు కోట్లకు విక్రయించిన వెట్టి మాన్యం భూమి
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ ప్రజలు

**సీతారామపురం, ఫిబ్రవరి 29:** జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉండే ప్రాంతం సీతారామపురం. మండల కేంద్రానికి మూడు జాతీయ రహదారుల పుణ్యమా అంటూ భూముల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. దీన్ని అదునుగా చేసుకున్న కొందరు అటు ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములు.. ఇటు మాన్యపు భూములను ఎడాపెడగా అమ్మేస్తున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామపురం సీతారామ డిగ్రీ కాలేజి, బెస్త కాలనీ మధ్యలో ఇనాం, అసైన్‌మెంట్ భూములను (పీర్ల మాన్యపు) కడప జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు రెండుకోట్ల రూపా యలకు కొన్నారు. మాన్యపు, వెట్టి భూములను అనుభవదారులు వార సత్వం కింద అనుభవించాలే తప్ప వాటిని క్రయవిక్రయాలు జరపరాదు. అయినా ఈ ప్రాంతంలో నేషనల్ హైవే పుణ్యమా అంటూ భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్టర్ల కన్ను ఈ ప్రాంతపు భూములపై పడింది. వారు ఇక్కడ కొంతమంది నాయకులను వారికి అనుకూలంగా ఏర్పాటు చేసుకుని కమిషన్లను ఎర చూపి యథేచ్ఛగా భూ దందాను కొనసాగిస్తున్నారు. సీతారామపురంలోని సర్వేనెంబర్ 536-12 లో 2 ఎకరాల 86 సెంట్లు మాన్యపు భూమిని షేక్ మహబూబ్ బీ.సయ్యద్ బీబీ జాన్‌లు అక్రమ మార్గంలో పాసుబుక్కులు పొందారని, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన దళారులు గుట్టు చప్పుడు కాకుండా రెవెన్యూ రికార్డులను ఎవరికి అనుమానం రాని రీతిలో చేశారని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. మాన్యపు భూమిని రెండు కోట్లకు విక్రయించడంతో స్థానిక ప్రజలు సీతారామపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వెట్టి భూమిని అన్యాక్రాంతానికి గురికాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకవైపు అసైన్‌మెంట్ భూములు, ప్రభుత్వ భూములు, వెట్టి, పీర్ల మాన్యపు భూములు అమ్మరాదు కొనరాదని నిబంధన ఉన్నా ఈ ప్రాంతంలో ఆ భూములను కోట్లాది రూపాయలకు విక్రయించడం ఎంత వరకు సబబని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా అధికారుల అనుమతితో వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దిమ్మె పైనుంచి పడిపోయిన కలికి యానాదిరెడ్డి విగ్రహం

- సీసీ పుటేజీలతో అభిమానుల అనుమానాలకు తెర



దిమ్మెపై నుంచి కింద పడిపోయిన మాజీ మంత్రి కలికి విగ్రహం

**కావలి, ఫిబ్రవరి 29:** కావలి పట్టణం ట్రంకురోడ్డులోని ఉదయగిరి రోడ్డు కూడలిలో ఉన్న మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి విగ్రహం బుధవారం అర్థరాత్రి దిమ్మెపై నుంచి పడిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రజలు కలికి అభిమానుల దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఉదయాన్నే వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా అక్కడకు వచ్చి పరిశీలించారు. అనంతరం విగ్రహాన్ని అక్కడ నుంచి తీసుకెళ్లి ఏరియా వైద్యశాలలోని ఒక గదిలో ఉంచారు. ఆ తదుపరి కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కూడా తన అనుచరులతో వచ్చి కలికి విగ్రహం ఉన్న దిమ్మెను, ఏరియా వైద్యశాలలో ఉంచిన విగ్రహాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీలు పరిశీలించిన అనంతరం దానిపై విచారణ చేపట్టాలనే భావనకు వచ్చారు. అక్కడే ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించగా అర్థరాత్రి ఒక ధాన్యం లారీ అక్కడ మలుపు తిరుగుతున్న సమయంలో విగ్రహం పక్కన ఉన్న వైరు తగిలి పడిపోయినట్లు తెలిసింది. దీంతో అనుమానాలకు తెరపడింది.


## ఆలస్యంగానైనా 'భారతరత్న' సంతోషకరం



సంస్మరణ సభకు హాజరైన అతిథులు, రైతులు, శాస్త్రవేత్తలు

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 :** హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్, దేశ మాజీ ప్రధాని, కర్షక నేత చౌదరి చరణ్‌సింగ్‌కు ఆలస్యంగానైనా భారతరత్న పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా మండలి సభ్యుడు డాక్టర్ డీ కోదండరామిరెడ్డి అన్నారు. వారిద్దరికి కేంద్రం భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామిరెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారని, దిగుమతులపై ఆధారపడిన మన దేశాన్ని స్వయం సమృద్ధిగా దిశగా నడిపి, విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి పెంచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త వినీత, రైతులు నిరంజ న్‌రెడ్డి, హనుమంతరావు నాయుడు, ఏవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

**నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 29:** ఉద్యోగ విరమణ చేస్తు న్న పోలీసు అధికారు లకు ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి ఆత్మీయ వీడ్కోలు పలికారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ సీహెచ్ కృష్ణానందం, సౌత్‌ట్రాఫిక్ ఏఎస్ఐ జీ ప్రభాకర్ ఉద్యోగ విరమణ పొందుతుండటంతో వారిని సన్మానించారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## ముగిసిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- చివరిరోజు ఒకరి డిబార్

**వెంకటాచలం, ఫిబ్రవరి 29:** విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షలు గురువారం ముగిసినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో 7,798 మంది విద్యార్థులకుగాను 7,198 మంది హాజరజ వగా మిగిలిన 600 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

## నేటి నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే

- పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్

**నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 29 :** జిల్లాలోని ఎంఎస్ఎంఈ (చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు) పనితీరును మెరుగు పరిచేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి వివరాల సేకరణకు ఆదేశాలు జారీ చేసిందని పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఈ సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే అనేక రాయితీలు పొందే అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా లోని అన్ని ఎంఎస్ఎంఈలు, నూతనంగా ఏర్పాటు చేసినవి సైతం వివరాలు నమోదు చేయించుకోవాలని, సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.

## సంపూర్ణంగా రైతు భరోసా హామీ

- వ్యవసాయ మంత్రి కాకాణి

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 :** రైతు భరోసా హామీని సంపూర్ణంగా నెరవేర్చామని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రైతులకు నాలుగు విడతల్లో రూ.50వేలు పెట్టుబడి సాయం అందిస్తామని గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ చెప్పిన దానికంటే అదనంగా మొత్తం రూ.67500 ఇచ్చారని చెప్పారు. నెల్లూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సున్నా వడ్డీ పంట రుణాల సబ్సిడీ కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఉచిత పంటల బీమాను అమలు చేస్తున్నామని, రైతులకు 9గంటలపాటు ఉచితంగా, ఆక్వా రైతులకు రూ.1.50పైసలకే సబ్సిడీతో విద్యుత్ అందిస్తున్నామని వివరించారు.

## నేటి నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

**నెల్లూరు(హరనాథపురం):** వైఎస్ఆర్ పెన్షన్ కానుక పేరుతో ప్రతినెలా ఇచ్చే సామాజిక పింఛన్లను మార్చి నెలకుగాను శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఈ పింఛను అందజేస్తారని తెలిపారు. జిల్లాలో 3,19,961 మంది పెన్షనర్లకు రూ. 95.77 కోట్లు పంపిణీ చేయిస్తున్నామని, పెన్షన్‌దారులు ఇంటి వద్దనే ఉండి పింఛను పొందాలని కోరారు.

## పెన్షన్‌కు లైఫ్ సర్టిఫికెట్

- మార్చి ఆఖరు వరకు సమర్పించే అవకాశం

**నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 29 :** పెన్షనర్లు తాము జీవించి ఉన్నట్లుగా ప్రతి సంవత్సరం లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీ కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్ సమర్పిస్తేనే విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ అందుతుంది. అయితే ఆ సర్టిఫికెట్ సమర్పణకు కొత్త నిబంధనలు రావటంతో విశ్రాంత ఉద్యోగులు అవస్థ పడుతున్నారు. గతంలో సర్టిఫికెట్‌పై గజిటెడ్ అధికారి సంతకం చేయిస్తే సరిపోయేది. ఇప్పుడు జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా పెన్షనర్లు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనతో పెన్షనర్లకు ఇబ్బందులు తప్పటం లేదు. వాటిని దృష్టిలో పెట్టుకొని లైఫ్ సర్టిఫికెట్లను మార్చి ఆఖరు వరకు తీసుకోవాలని ట్రెజరీ అధికారులు నిర్ణయించారు. మార్చి నెలలో పెన్షన్ యథాతథంగా అందుతుందని ట్రెజరీ డీడీ గంగాద్రి పేర్కొన్నారు. మార్చి ఆఖరులోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరారు.

## అధికార పార్టీ నేతలు, అధికారులు వేధిస్తున్నారు !

- న్యాయం చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తా
- వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్

**కావలి, ఫిబ్రవరి 29:** పార్టీలు, కులాలకు అతీతంగా పనిచేసినందుకు తనను కావలి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు బెదిరించగా వారి ఒత్తిడుల మేరకు అధికారులు వేధిస్తున్నారని కావలి పట్టణ మద్దూరుపాడుకు చెందిన వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం సాయంత్రం కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ 8 నెలల కిందట సస్పెన్షన్‌కు గురికాగా అధికారులు విచా రించి తిరిగి పోస్టింగ్ ఇవ్వగా కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ తనను చేర్చుకోకుండా 20 రోజులుగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత తనను చేర్చుకుంటానని చెపుతున్నారంటే ఆయన అధికార పార్టీ నేతల ఒత్తిడులకు భయపడినట్లుందన్నారు. ఎమ్మెల్యే వారి అనుచరులు తనను బెదిరించిన దానికి సంబంధించిన ఆడియో రికార్డులన్నీ తన వద్ద ఉన్నాయన్నారు. అధికారులు తనకు న్యాయం చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని చెప్పారు.

**ఆర్డర్ తీసుకుని ఉద్యోగంలో చేరమన్నాం**

వెల్ఫేర్ సెక్రటరీ భాస్కర్ సస్పెన్షన్ ఎత్తివేస్తూ పోస్టింగ్ ఇవ్వమని మాకు ఉత్తర్వులు వచ్చాయి. ఆమేరకు తాము ఆయనకు పోస్ట్ చేయగా, ఆ అడ్రస్‌లో లేనందున అది వెనుకకు వచ్చింది. ఇప్పుడు పోస్టింగ్ కోసం కార్యాల యానికి రాగా, ఆ ఉత్తర్వుల కాపీ తీసుకుంటే పోస్టింగ్ ఇస్తామని చెప్పా. ఉత్తర్వుల కాపీ తీసుకోకుండానే ఏదో కాగితం చూపించి పోస్టింగ్ ఇవ్వమంటున్నారు.

- జీ. శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్

# మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

- పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం
- పలు సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు




సమావేశంలో చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, సమస్యలపై నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్

**ఆత్మకూరు, ఫిబ్రవరి 29:** స్థానిక మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఏడాది అభివృద్ధి పథంలో ముందుకెళుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జి. వెంకటరమణమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బడ్జెట్‌పై నిర్వహించిన సాధారణ సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఆదాయాన్ని పెంచుకునేదిశగా రూ.29.39 కోట్ల బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ తీర్మానం కోసం సమావేశంలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షదాయకమన్నారు. అజెండాలో పొందుపరిచిన ఆత్మకూరులోని నారంపేట పారిశ్రామికవాడకు 1ఎంఎల్‌డి వాటర్ తరలింపునకు పాతజంగాలపల్లి వద్ద నుంచి వాల్వ్ గేట్‌ను అమర్చి నీటి సరఫరా చేసేందుకు టీడీపీ కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, మాదాల శ్రీనివా సులనాయుడు, వైసీపీ రెబల్ కౌన్సిలరు సూరా భాస్కర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమశిల జలశయం నుంచి మున్సిపాల్టీకి తాగునీటి సరఫరా చేసే పైపులకు వాల్ గేట్ అమర్చి నీటిని మళ్లిస్తే భవిష్యత్‌లో మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండురోజులకోసారి ప్రజలకు తాగునీటిని సరఫషరా చేసే పరిస్థితి ఉందని వాపోయారు. ఈ క్రమంలో పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రారంభ నిల్వలు ఎక్కడున్నాయో చెపాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. డబ్బులుంటే పనులు చేసిన కాంట్రాక్టర్లకు, ఉద్యోగులకు జీతభత్యాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలని పట్టుబట్టారు. పారిశుధ్యం మెరుగుదల, పందుల నియంత్రణ, వీధి దీపాలు డ్రైనేజి నిర్వహణ తదిర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వైసీపీ కౌన్సిలర్లు సైతం అజెండాలోని కొన్ని అంశాలను వాయిదా వేయాలని కోరారు. ముందుగా మున్సిపల్ సమావేశంలో 88 అంశాలతో అజెండాపై కౌన్సిల్ తీర్మానంపై చర్చించారు. అందులో నాలుగు అంశాలను వాయిదా వేసి 84 అంశాలను చర్చించిన అనంతరం కౌన్సిల్‌లో ఏకగ్రీంగా ఆమోదించబడ్డాయి. కార్యక్రమంలో కమిషనర్ షేక్ ఫజుల్లాలా, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాసీమ్ పాల్గొన్నారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

# టీడీపీని గెలిపించాలి

- ఇంటింటి ప్రచారానికి ఇంటూరి సౌజన్య శ్రీకారం

**కందుకూరు, ఫిబ్రవరి 29:** కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య గురువారం ఇంటింటి ప్రచారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఆమె మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాల కరపత్రాలు పంపిణీచేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి పాటుపడాలని, చంద్రబాబునాయుడుకు, ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుసుమ కుమారి, దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య

## ఐఎస్ రావు నగర్‌లో బాబు ష్యూరిటీ కార్యక్రమం

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలోని 32వ వార్డు పరిధిలో ఉన్న 60 అడుగుల రోడ్డు, ఐఎస్ రావు నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండునెలల్లో తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడబోతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, అత్తంటి వరప్రసాద్, చుంచు వేణు, గుమ్మళ్ల మాల్యాద్రి, ఎండ్లూరి బ్రహ్మయ్య, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

**సంగం, ఫిబ్రవరి 29:** మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాదికారి డాక్టర్ ఖాదర్ వలి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు.. వ్యాక్సిన్ నిల్వ చేయు ఐఎల్‌ఆర్, డీప్ ఫ్రీజర్‌లను పరిశీలించారు.

**అనంతసాగరం:** స్థానిక పీహెచ్‌సీని గురువారం జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పల్స్‌పోలియో ఏర్పాట్లను ఆరా తీశారు.

## స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బాధ్యతల స్వీకరణ

**ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 29:** స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్‌గా భారతిసిద్ధ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు ఎస్సీ, ఎస్టీ పబ్లి ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

## బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి

**అనంతసాగరం, ఫిబ్రవరి 29:** ఆధార్‌లో వయస్సు తక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌కు అర్హత పొందలేక పొందలేక పోతున్నామని డప్పు కళాకారులు వాపోయారు. ఆధార్‌లో వయస్సు మార్పుకోసం తమకు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని గురువారం వారు అనంతసాగరం తహసీల్దారు నరసింహను కలిసి నతిపత్రం అందజేశారు. వారి వెంట సీఐటీయూ మండల అధ్యక్షుడు అన్వర్‌బాష ఉన్నారు.

## డిప్యూటీ ఈవో ఆకస్మిక తనిఖీ



నాడు-నేడు పనులపై విద్యాకమిటీకి సూచనలిస్తున్న డిప్యూటీ ఈవో

**సీతారామపురం:** మండకేంద్రంతో పాటు అయ్యవారిపల్లి హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలను గురువారం డిప్యూటీ ఈవో పసుపులేటి రఘురామయ్య తనిఖీ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మార్చి నెలలో జరగనున్న పది పరీక్షల కోసం సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఈవో మస్తాన్‌వలి ఉన్నారు.

**మర్రిపాడు:** డిప్యూటి ఈవో రఘురామయ్య గురువారం పోలిరెడ్డిపల్లి ఉన్నతపాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ స్థాయి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అందులో ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి, ఉత్తమ ప్రాజెక్టులో ఎంపికైన వారికి ప్రశంశపత్రాలను అందజేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి విద్యాకమిటీ సభ్యులకు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి-2 ధనలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ ఉన్నారు.

## వైసీపీకి ఉదయగిరి నేతల రాజీనామా



విలేకరులతో మాట్లాడుతున్న చేజర్ల సుబ్బారెడ్డి తదితరులు

**ఉదయగిరి రూరల్:** వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇకనుంచి తన రాజకీయ పయనమంతా వేమిరెడ్డితోనే ఉంటుందన్నారు. అలాగే వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ముటుకుందు వెంకటరెడ్డి, సీతారామపురం మాజీ ఎంపీపీ నేలటూరు అబ్రహం, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేజర్ల సుధాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచి ఉప్పుటూరి హరి తదితరులు కూడా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్‌సీ రమణారెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు బాలిబోయిన శ్రీనివాసులు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సమాచారం లేకపోవడం అవమానంగా భావిస్తున్నా...

**కలిగిరి:** 'ఉదయగిరిలో 2011 నుంచి 2024 వరకు టీడీపీ అభివృద్ధికి కష్టపడి పని చేశా.. అలాంటిది తనకు పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ మార్పు విషయమై కనీస సమాచారం ఇవ్వకుండా, మరొకరికి కేటాయించడంపై అవమానానికి గురయ్యా.. కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటా'... అని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు భావోద్వేగానికి గురయ్యారు. కలిగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన కనీళ్ళపర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టికెట్ మార్పు విషయంలో జరిగిన అవమానాన్ని జీవితంలో మర్చిపోనని, మార్చి 2న చంద్రబాబు జిల్లా పర్యటన అనంతరం నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు.

**బొల్లినేని నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం : ఓంకారం**

**కొండాపురం:** ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని మండల పార్టీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం పేర్కొన్నారు. గురువారం ఓంకారం అధ్యక్షతన పార్టీ శ్రేణులు సమావేశమై బొల్లినేని నిర్ణయం వచ్చేంత వరకు ఎటువంటి కార్యక్రమాలు చేయబోమని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భగా ఓంకారం మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఉదయగిరిలో బొల్లినేని ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేశామన్నారు. ఈకార్యక్రమంలో 19 పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఈవోకు సన్మానం



చేజర్ల : పంచాంగుల కళాధర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**చేజర్ల, ఫిబ్రవరి 29:** మండల విద్యాశాఖ అధికారి పంచాంగుల కళాధర్ పదవీ విరమణ సన్మానంను గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎమ్‌వో జి.సుధీర్ బాబు, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడికి సన్మానం**

**ఉదయగిరి రూరల్:** స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ గురువారం పదవీ విరమణ పొందిన సయ్యద్ తహీర్ అలీహుస్సేని (కలీం)ను ఉపాధ్యాయులు, మిత్రబృందం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

## పదవీ విరమణ చేసిన జెట్టి ఎర్రయ్య



మాట్లాడుతున్న డాక్టర్ మాశిలామణి

**వింజమూరు:** స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన జెట్టి ఎర్రయ్యను గురువారం కళాశాల యాజమాన్యం పట్టణ పురప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మాసిలామణి పాల్గొని మాట్లాడారు. గుండెమడుగుల హైస్కూల్ హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రాజా పవన్‌కుమార్, వివేకానంద జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మద్దూరు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ఉదయగిరి రూరల్ :** స్థానిక ఏఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈనెల 18వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారులు రమణ, కమలహాసన్‌లు తెలిపారు. గురువారం కళాశాలలో ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

**ఉదయగిరి రూరల్ :** సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

**ఉదయగిరి, ఫిబ్రవరి 29:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి రికార్డులను పరిశీలించారు.

## ఆలయానికి శంకుస్థాపన

**సంగం, ఫిబ్రవరి 29:** నీలాయపాళెంలో దేవాదాయశాఖ ద్వారా మంజూరైన రూ.50 లక్షల నిధులతో సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

**వరికుంటపాడు:** వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం తూర్పు రొంపిదొడ్ల, దక్కనూరు గ్రామాల్లో నిర్వహించిన విజయ సంకల్పయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, గుంటుపల్లి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

**వింజమూరు:** స్థానిక ఎస్వీ కళ్యాణమండపంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మాధవి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల ప్రారంభం

**అనంతసాగరం, ఫిబ్రవరి 29:** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి ఖాదర్‌వలి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## వలంటీర్లకు సన్మానం

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** మండలకార్యాలయ ఆవరణలో దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన వలంటీర్లకు వందనం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడినాఆ సన్మానించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**ఉదయగిరి:** స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మండలంలోని వలంటీర్లకు సేవరత్న, సేవవజ్ర పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉదయగిరిలో ఉపాధ్యాయుల ధర్నా

**ఉదయగిరి రూరల్:** స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓ.శ్రీనివాసరాజు తహసీల్దారు సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు ఖాదర్‌బాషా, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్షులు ఓబులేసు, మాధవరాజు, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** నందిపాడు అభయాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు వేదపండితులు ప్రత్యే పూజలు చేసి స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా చేపట్టారు. మహోత్సవంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కాకర్ల సురేష్ ఈపాల్గొన్నారు.



## ఘనంగా రాజగోపుర కలశ ప్రతిష్ఠ



మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

**కందుకూరు, ఫిబ్రవరి 29:** స్కంధపురి జనార్ధన స్వామి దేవస్థానం నూతన రాజగోపుర కలశ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. వేలాదిమంది భక్తుల సమక్షంలో టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఈవో భైరాగి చౌదరి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం జయప్రదం చేయండి

**కందుకూరు, ఫిబ్రవరి 29:** ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం మార్చి 2న అద్దంకిలో జరుగుతుందని, ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాల్గొంటున్నందున మాదిగ ఉద్యోగులంతా అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మాదిగ ఉద్యోగులతో పాటు విద్యార్థులు, యువకులు, ఎంఆర్పీఎస్ బాధ్యులు, ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

## ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



జగనన్న లేఅవుట్ల స్థలాల రిజిస్ట్రేషన్ల పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్

**లింగసముద్రం, ఫిబ్రవరి 29:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. గురువారం లింగసముద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీలలోని జగనన్న లేఅవుట్లలోని 712 మంది ఇళ్ల స్థలాల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాలను తహసిల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ యు శేషుబాబు, రీ సర్వే డీటీ టి ప్రసాద్, గ్రామ సర్పంచ్ పులి రాఘవులు తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పి తిరుపతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వి కృష్ణారెడ్డి పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోగోలులో ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభం

**బిట్రగుంట, ఫిబ్రవరి 29:** బోగోలు మండలంలో ప్రజా ఆశీర్వాద యాత్రను వైసీపీ కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం సాయత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో అధ్యక్షుడు మాల్యాద్రి, రమణయ్య, అంకులయ్య, శ్రీనివాసులు, సర్పంచులు మాచర్ల, గిరిబాబు, రామారావు ఎంపీటీసీలు కైశల్య, సుందర్‌రాజ్ తదితరులు ఉన్నారు.

## రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

**బిట్రగుంట, ఫిబ్రవరి 29:** బోగోలు మండలం తాళ్ళూరు పంచాయతీలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్‌నాగరాజు పదవీ విరమణ సమావేశం పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయింత్‌బాబు, నరసింహారావు, ఉపాధ్యాయులు రాధయ్య, పాస్టర్ శ్యాంసన్‌బాబు, టీడీపీ నాయకులు ఎల్ సుధీర్‌బాబు, మాధవరావు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాల్యాద్రి, హరిబాబు, వెంకయ్య పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ పోటీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పసుపులేటి వెంకటేశ్వర్లు

**అల్లూరు, ఫిబ్రవరి 29 :** స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ ఎన్నికల బరిలో ఉంటారని, ఇరు పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల సమన్వయకర్త ఎల్లు సాల్మన్‌రాజు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపులేటి కొన్ని కార్యక్రమాల వలన బయటకు వెళ్లాల్సి వచ్చిందని, దీనిని అదునుగా చూసుకొని ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయన తిరిగి రాడని, పోటీ చేయడం లేదని దుష్ప్రచారాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు నమ్మవద్దన్నారు. పోటీ చేయకుండా వెనకడుగు వేసే ప్రసక్తేలేదని ఆయన తేల్చి చెప్పారు. సమావేశంలో దర్శిగుంట వాసు, గుమ్మడి రాజేష్‌బాబు, కప్పల నవీన్‌కుమార్, పసుపులేటి ప్రసాద్, వల్లపు అనీల్, ఎల్లు సుబ్రహ్మణ్యం, కలిచేటి వెంకటేష్, కర్రా మల్లికార్జున, కందల శివరామిరెడ్డి, యజ్ఞానీబాషా పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు

**కావలి, ఫిబ్రవరి 29:** ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు గురువారం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎస్ రద్దుచేయాలని, బకాయిలు చెల్లించాలని ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 21వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీటీఎఫ్ డివిజన్, కావలి, జలదంకి, బోగోలు మండల శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జీ క్రిష్ణయ్య, కటారి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, ప్రధాన కార్యదర్శి సాయిరాం సింగ్, కావలి, బోగోలు, జలదంకి మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీలో చేర్చాలి



ర్యాలీ చేస్తున్న పూసల సామాజిక వర్గ ప్రజలు

**కొండాపురం, ఫిబ్రవరి 29:** పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీలలో చేర్చాలని ఆ సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆసంఘ జిల్లా అధ్యక్షుడు పొదిలి రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంభం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పూసల సామాజిక వర్గం దీనావస్థలో ఉందన్నారు. గాజులు, పూసలు అమ్ముకుంటున్నామే తప్ప ఏ ప్రభుత్వం తమను ఆదుకోలేదన్నారు. పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేకంగా కార్పొరేషన్ చేసి నిధులు కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు కాలనీ నుండి ర్యాలీగా వెళ్లి స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పొదిలి రాము, రాష్ట్ర యువజన అధ్యక్షుడు మునగాల సునీల్, తుపాకుల వెంకటరమణ, చేని కుమారి, ము నగాల రాంబాబు, సూర్య చిరంజీవి, మండల అధ్యక్షుడు మునగాల సుధాకర్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

## మాలకొండలో దుకాణాలకు వేలం పాటలు


- మూడోసారి వాయిదాపడ్డ తలనీలాల వేలంపాట



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 29:** మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 5 దుకాణాల బహిరంగ వేలం పాట ద్వారా రూ.92,60,000 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయంలోని కల్యాణ మండపంలో గురువారం కందుకూరు గ్రూప్ ప్రథమ శ్రేణి కార్య నిర్వహణాధికారి వీవీఎల్ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరిచిప్పలు పోగుచేసుకొనే హక్కు పాటను రూ.17 లక్షలకు, అద్దాలు, ఫొటోల అంగడిని రూ.35,10,000 కాకర్లవారిపాలెం గ్రామానికి చెందిన కండ్లగుంట మాల కొండయ్య పాడుకున్నాడు. అదేవిధంగా కొబ్బరికాయలు రెండు అంగళ్లను పోలినేనిపాలెంకు చెందిన జాలారి ప్రసాద్ రూ.26,05000కు, ఫలహారసాల 1, 2 అంగళ్లను మాలకొండకు చెందిన వంకదారి కొండయ్య రూ.9,10,000కు, పాదరక్షలు భద్రపరచే పాటను అయ్యవారి పల్లెకు చెందిన బచ్చు వెంగళరావు రూ. 5,35,000లకు పాడుకున్నారు. తలనీలాలు వేలం పాట మూడోసారి కూడా వాయిదా పడినట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేలం పాటలలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

**లింగసముద్రం, ఫిబ్రవరి 29:** మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను కందుకూరు ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం కందుకూరు ఎస్ఈబీ ఎస్సై దీప్తికరంత్ సిబ్బందితో దాడి చేసి ఎలాంటి అనుమతి పత్రాలు, లైసెన్స్ లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను, ముగ్గురు డ్రైవర్లను గ్రామ శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఈబీ ఎస్సై లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై ఎం బాజీబాబు ముగ్గురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

# ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కష్టాలు

**దాహార్తితో స్థానికుల అవస్థలు**



నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్



తాగునీటిని సరఫరా చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి ట్యాంకర్

**కావలి రూరల్, ఫిబ్రవరి 29:** కావలి పట్టణ ముసునూరు ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం కాలనీ వాసులు అలమటిస్తున్నారు. సుమారు 6000 మంది పేదలు నివసించే కాలనీ లో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నేతలు, అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రపు చేతి పంపులు తప్ప నీటి వనరులు లేకపోవటం ఆప్రాంత పేదలకు శాపంగా మారింది. ఇదిలా ఉండగా కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం 90 శాతం పూర్తిచేసి, కాలనీ వీధుల్లో పైపులైన్లు సైతం పూర్తిచేశారు. కానీ వాటర్‌ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి నీటి సరఫరా చెయ్యకుండా అధికార పార్టీ నేతలు మున్సిపాలిటీకీ ట్రాక్టర్లు పెట్టి అరకొరగా నీళ్ల తోలుతూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ఎన్నికల కోడ్ రాకముందే బిల్లులు రావన్న భయమో ఏమో గాని ట్రాక్టర్లతో నీటి సరఫరా నిలిపివేశారని అట్లల ఫ్యాక్టరీ కాలనీ, బీఈడి కాలేజ్ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

కాగా, తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయం కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు కాలనీ వాసులు తెలిపారు. దీంతో నాలుగు రోజులుగా ఇందిరమ్మ కాలనీలోని వికలాంగుల కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, వినాయక కాలనీ, అట్లల ఫ్యాక్టరీ కాలనీలకు తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తూ నీటి దాతగా నిలిచి దాహార్తి తీరుస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.

## రొయ్యల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రతినిధి ధనుంజయ్

**ఇందుకూరుపేట, ఫిబ్రవరి 29:** రొయ్యల బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రతినిధి ఎం ధనుంజయ్ రైతాంగానికి సూచించారు. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో గురువారం రొయ్యల సాగుదారులకు బీమా పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీమా పథకం ద్వారా కలుగు ప్రయోజనాలను వివరించారు. రొయ్యలకు సోకే వివిధ రకాల వ్యాధులకు కలుగు నష్టానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. కాగా, స్థానిక ఆక్వా రైతు పి హనుమంతరావు నాయుడుతో పాటు పలువురు రొయ్యల రైతులు బీమా పథకం తీసుకున్నారు. ఈ సమావేశంలో రొయ్యల రైతులు పాల్గొన్నారు.

## పొదలకూరు ఎస్ఐగా రామకృష్ణ



ఎస్ఐ రామకృష్ణ

**పొదలకూరు, ఫిబ్రవరి 29:** నాలుగు నెలలుగా ఇన్‌చార్జ్ ఎస్ఐతో కాలం నెట్టుకొస్తున్న పొదలకూరు పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు గురువారం రెగ్యులర్ ఎస్ఐ వచ్చారు. గుంటూరు రేంజ్ పరిధిలోని రేపల్లెలో ఎస్ఐగా పనిచేస్తున్న డి.రామకృష్ణను పొదలకూరు ఎస్ఐగా నియమించారు. ముందుగా ఆయన స్టేషన్ ఆవరణంలో విఘ్నేశ్వరునికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలను స్వీకరించారు. రెగ్యులర్ ఎస్ఐ నియామకంపై మండల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఐ రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల విధులతోపాటు పట్టణంలో ట్రాఫిక్, ఈవ్‌టీజింగ్, అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి పెడతామన్నారు.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**పొదలకూరు, ఫిబ్రవరి 29:** మండలంలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మాస్ కాపీయింగ్ జరుగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు. అధికారులతో పాటు సిబ్బంది కేంద్రాల్లో సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి వీలు ఉండదన్నారు. అలాగే విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్లకూడదని వెల్లడించారు.

## 22 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

**బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 28:** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన, కమిషనర్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ప్రవేశపెట్టిన అజెండాలోని 22 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరుకాగా సుమారు 7మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.

## అధికారంలోకి వస్తే కుటుంబానికి రూ.5 వేలు

**మనుబోలు, ఫిబ్రవరి 29 :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతినెలా ఒకటవ తేదీ ప్రతి కుటుంబానికి రూ.5 వేలు అందజేస్తామని పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన అక్కంపేటలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. రైతు కుటుంబానికి రూ.లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తామన్నారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు పోలయ్య తదితరులున్నారు.













## ప్రజలను మభ్యపెట్టే మోసగాడు కాకాణి

● కాసులు తప్ప.. ప్రజల ప్రాణాలు పట్టవు : సోమిరెడ్డి



అవగాహన కల్పిస్తున్న సోమిరెడ్డి

**ముత్తుకూరు, ఫిబ్రవరి 29:** మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేయడం తప్ప వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి ప్రజలకు చేసిందేమీ లేదని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం ముత్తుకూరులో నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. థర్మల్ కేంద్రాల్లో బూడిద తీసుకెళ్లేందుకు టన్నుకు రూ.100..టిప్పర్‌కు రూ.500 వసూలు చేయడమే కాకాణి బ్యాచ్‌కి పనిగా మారిందన్నారు. అధికారంలో లేకున్నా ప్రజల సంక్షేమం కోసం కాదు ఎన్నో కార్యక్రమాలు చేస్తే మంత్రిగా ఉండి వసూళ్ల తప్ప ప్రజల గురించి పట్టించుకోని కాకాణికి ప్రజలు త్వరలో బుద్ధి చెప్తారన్నారు. మారణాయుధాలతో తమపై దాడి చేసి, టీడీపీ వాళ్లపైనే ఎదురు ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించిన ఘనత కాకాణిదేనన్నారు. తాము అధికారంలోకి రావడం ఖాయమని కాకాణి తగ్గించి ఇచ్చిన రూ.18వేల మత్స్యశాఖ ప్యాకేజీని మండలంలో అందరికీ తప్పనిసరిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. చవిటి కాలువలకు శిలాఫలకాలు వేసుకోవడం తప్ప దేవరదిబ్బ గ్రామస్తులు కాలుష్యం నుంచి కాపాడి తమను తరలించమని కోరితే పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు పట్టపు శోభన్, వాంకిలి శ్రీనయ్య, రమేష్, కాంతారావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు పాడె కట్టడానికి ప్రజలు సంసిద్ధం

● కోవూరు టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

**విడవలూరు, ఫిబ్రవరి 29:** రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి పాడె కట్టడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని కోవూరు టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పార్లపల్లిలో గురువారం జరిగిన ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల కలయిక రాజ్యాధికారం కోసం కాదని ప్రజల సంక్షేమం కోసమన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కోవూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా రెపరెపలాడుతుందన్నారు. ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, గ్రామ సర్పంచ్ రామిశెట్టి స్వాతి, నాయకులు చెముకుల శ్రీనివాసులు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, పూండ్ల ఏసోబు, పంది శీనయ్య, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు కోరుకున్న ఆలయాలను నిర్మిస్తున్నాం

● మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**వెంకటాచలం, ఫిబ్రవరి 29:** సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆధ్యాత్మికతను కూడా మేళవించేందుకు ప్రజలు కోరుకున్న ఆలయాలను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిదులు రూ.50 లక్ష లతో పూడిపర్తిలో నిర్మించనున్న శ్రీసీతారామాంజనే యులు స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కారూరు శ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు కోడూరు శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కొండూరు మురళీధర్‌రావు, సర్పంచ్ దక్కిలి శ్రావణి, నాయకులు మందల వెంకటశేషయ్య, కనుపూరు కోదండరామిరెడ్డి, దక్కిలి రమణయ్య తదితరులున్నారు.

## మహమ్మద్ రఫీకి సన్మానం

**మనుబోలు, ఫిబ్రవరి 29:** స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన షేక్ మహమ్మద్ రఫీకి పలువురు ఘనంగా సన్మానించారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు డేవిడ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## ముమ్మాటికి దళితద్రోహి కాకాణినే !

● టీడీపీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్

**వెంకటాచలం, ఫిబ్రవరి 29:** సర్వేపల్లి నియోజకవర్గంలో దళితులపై దమనకాండ కొనసాగిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముమ్మాటికీ దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయాడని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ విమర్శించారు. వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎస్సీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కట్టువపల్లిలో దళితుడైన బల్లి వెంకటయ్యకు మద్యం పోయించి టీడీపీ నాయకులపై ఉసికొల్పడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులపైనే దౌర్జన్యం చేసి తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టడం వైసీపీ దుర్మార్గాలకు పరాకాష్ట అన్నారు. కాకాణికి డబ్బు మీద ఉన్న మోజు సర్వేపల్లి ప్రజలపై లేదన్నారు. మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన దళితులకు నష్టపరిహారం అందించకుండా మెక్కేసిన మహానుభావుడు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో దళితులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు ఇలా ఒక్కొక్కటిగా చెప్పుకుంటూపోతే రోజులు సరిపోవన్నారు. రాబోయే ఎన్నికల్లో కాకాణికి దళితులే తగిన బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో దాసి చక్రధర్, మందా రమణయ్య, గిద్దలూరు వెంకటేశ్వర్లు, ఆస్తోటి నాగరాజు, తాటిపర్తి వేణు, నలబాలపు వెంకటాద్రి, ఆత్మకూరు ఆది, వెంకటసుబ్బయ్య, మునిచంద్ర, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, వెంకయ్య తదితరులు ఉన్నారు.

## వీఎస్‌యూలో పంచ్ ప్రాణ్ కార్యక్రమం



మాట్లాడుతున్న వీసీ సుందరవల్లి

**వెంకటాచలం, ఫిబ్రవరి 29:** కాకుటూరు సమీపం లోని విక్రమ సింహపురి యూని వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం యువ సంవాద్ - ఇండియా 2047 అనే కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ నిర్దేశించిన పంచ్ ప్రాణ్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ సుందరవల్లి పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, పుట్టా శేషారెడ్డి, డాక్టర్ ఏ మహేంద్రరెడ్డి, డాక్టర్ కే విద్యాప్రభాకర్, విజయానంద్‌కుమార్‌బాబు, డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ చెంచురెడ్డి తదితరులున్నారు.

## వసతులున్నా అభివృద్ధికి నోచుకోని కృష్ణపట్నం బీచ్

**ముత్తుకూరు, ఫిబ్రవరి 29:** అన్ని వసతులు ఉన్నా కృష్ణపట్నం బీచ్ పర్యాటక అభి వృద్ధికి నోచుకోవడం లేదని జనసేన సర్వే పల్లి నియోజకవర్గ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన జనసేన నాయకులతో కలిసి కృష్ణపట్నం బీచ్‌ని పరిశీలించి మాట్లాడారు. పర్యాటక రంగానికి ఎంతో అనువైన ప్రాంతం కృష్ణపట్నం తీరమన్నారు. బీచ్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని వసతులు ఉన్నాయన్నారు. పర్యాటక శాఖ మంత్రి రోజాకు కాసులు వాదులు చేసుకోవడం తప్ప పర్యాటక అభివృద్ధి పట్టడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయే జనసేన తెలుగుదేశం ఉమ్మడి ప్రజా ప్రభుత్వంలో మెరీనా బీచ్‌ని తలపించే విధంగా ఉన్న కృష్ణపట్నం బీచ్‌ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమినేని వాణిభవానీ, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, మస్తాన్, గిరి, నికిత్, వెంకటాచలం మండల కార్యదర్శి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చదువే ఆస్తి..



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్

**మనుబోలు, ఫిబ్రవరి 29:** పేదలకు చదివే ఆస్తి అని ఎస్ఐ అజయ్‌కుమార్ అన్నారు. మనుబోలులోని ఎస్సీ బాలికల హాస్టల్‌లోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యా ర్థినులకు గురువారం పద్మావతి కళ్యాణమండపం అధినేత యనమల అంకయ్య ఆధ్వ ర్యంలో పరీక్షా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చ న్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎంతో ఆశపెట్టుకొని చదివిస్తారని వారి ఆశలను ఓమ్ము చేయకుండా బాగా చదువుకొని మంచి పేరు తేవాలన్నారు. ఏ సాయం కావాలన్నా తాను అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ నరసింహారెడ్డి, హెచ్‌డబ్ల్యూ మహేశ్వరి, దాత యనమల అంకయ్య తదితరులున్నారు.



# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

## టీడీపీలోకి భారీ చేరికలుంటాయి

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



మహాపూర్ణాహుతి కార్యక్రమంలో కోటంరెడ్డి దంపతులు

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 29 :** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నెల్లూరుకు వస్తున్న సందర్భంగా ఆ రోజు పార్టీలో భారీ స్థాయిలో చేరికలు ఉంటాయని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వెల్లడించారు. గురు వారం 6వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు, జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు ఇళ్ల పంపిణీ చేస్తామని, సంగం బ్యారేజీ నుంచి నెల్లూరులోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని, పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### బాలయ్య సైన్యం విస్తృత ప్రచారం

నగరంలోని 48వ డివిజన్‌లో బాలయ్య సైన్యం గురువారం విస్తృత ప్రచారం చేపట్టింది. చిరు వ్యాపారులను కలిసి నారాయణకు ఓటేసి గెలిపించాలని కోరింది. సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి మాట్లాడుతూ వైసీపీ పాలనలో తమకు న్యాయం జరగటం లేదని వ్యాపారులు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాధికార సమితి కన్వీనర్ కేసీ కృష్ణ, బాలయ్య సైన్యం నాయకులు సూదుల గుంట ప్రసాద్ నాయుడు, శ్రీహరి నాయుడు, పోతయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

### టీడీపీలోకి సుధాకర్‌రెడ్డి

**నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) :** నగరంలోని 23వ డివిజన్ పడారుపల్లికి చెందిన వైసీపీ ముఖ్య నేత పాముూరు సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. గురువారం పడారుపల్లిలో ఏర్పాటు చేసిన సభలో వీరందరూ పార్టీలో చేరగా, ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ టీడీపీలో చేరేందుకు అనేక మంది ముందుకు వస్తుంటే కొందరు వైసీపీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కాగా, రూరల్ నియోజకవర్గంలోని 33వ డివిజన్ వెంగళరావునగర్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు.

### వైభవంగా శత చండీయాగం

**నెల్లూరు (సాంస్కృతికం):** నగరంలోని కనుపర్తిపాడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు శత చండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5రోజుల దీక్ష, 108 సార్లు చండీ పారాయణంతో యాగాన్ని పూర్తి చేశారు. సిద్ధలక్ష్మీ సమేత వల్లభ మహాగణపతి హోమం, రాజ శ్యామల హోమం, వారాహి హోమం, బాలాత్రిపుర సుందరీ హోమం కూడా నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో నారసింహ ఇష్టి హోమం

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 29 :** నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న అష్టలక్ష్మీ యాగంలో భాగంగా గురువారం నాకసింహ ఇష్టి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకుడు పీతాంబరం రఘునాథాచార్య స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. యాదాద్రి క్షేత్రం ప్రధాన అర్చకుడు కొండూరి వెంకటాచార్యులుకు పాంచరాత్ర ఆగమ రత్న అవార్డు ప్రదానం చేశారు.

## ఉమామహేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల ప్రారంభం

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 29 :** నగరంలోని వాహబ్‌పేట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు 9వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 8వతేదీ మహా శివరాత్రి సందర్భంగా రాత్రి లింగోద్భవ పూజలు, 9వతేదీ శివపార్వతుల కల్యాణం, రాత్రి ఏకాంత సేవ జరుగుతాయని, భక్తులందరూ తరలి రావాలని కోరారు.

## క్రీడల్లోనూ రాజకీయమా..?

● విహారికి క్షమాపణ చెప్పాలి : కోటంరెడ్డి




మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

**నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 29 :** క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచాల్సిన ప్రభుత్వం అందులో కూడా రాజకీయం చేస్తోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుల అహం, తల పొగరు క్రీడాకారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయని దుయ్యబట్టారు. క్రికెట్లో ప్రతిభ కనపరుస్తున్న హనుమ విహారి వైసీపీ రాజకీయాలకు బలయ్యాడన్నారు. విహారి తప్పేమీలేదని టీం సభ్యులంతా చెబుతున్నప్పటికీ వైసీపీ నేతల శాడిజం వల్ల ఆతను ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నారు. ఏపీ ప్రభుత్వం విహారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కప్పిర శ్రీనివాసులు, పిట్టి సత్యనారాయణ, మొయినుద్దీన్, పట్ట అజయ్‌రెడ్డి, సుజన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



ప్రజాపోరు యాత్రలో బీజేపీ నాయకులు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 29:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ నాయకుడు పీ సురేంద్రరెడ్డి కోరారు. నగరంలోని మూలాపేట సెంటర్‌లో గురువారం బీజేపీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టే క్రమంలో బీజేపీ చేపట్టిన ప్రజాపోరు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమ పరిపాలనకు త్వరలోనే చమరగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి చేసే బీజేపీకి పట్టం కట్టాలని, అరాచక పాలనకు స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడతల రమేష్, కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, షైడిమాని సృజన తదితరులు పాల్గొన్నారు.

## జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది : అజీజ్



నారాయణను గెలిపించాలని అభ్యర్థిస్తున్న అజీజ్

**నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 :** తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు నిర్వహించిన జెండా సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. నగరంలోని 51వ డివిజన్ తానేవారి వీధిలో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అజీజ్ మాట్లాడుతూ వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయని చెప్పారు. ఆ రెండు పార్టీలు చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీదూరి ప్రశాంత్‌కుమార్, కమతం ప్రశాంత్‌కుమార్, అరవ రాజేష్, బండి ప్రేమ్‌కుమార్, మీదూరి అశోక్, కుమార్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

## బుల్లి శాస్త్రవేత్తల వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనలో బాలబాలికలు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 29:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నగరంలోని కొండాయపాలెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం బుల్లి శాస్త్రవేత్తలు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రాశి పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం

**మనుబోలు, ఫిబ్రవరి 29:** రానున్న ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయ మని టీడీపీ నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, పొన్నూరు రామకృష్ణయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కట్టువపల్లిలో ఏ తప్పు చేశారని ఐదుగురు టీడీపీ నాయకులపై 307 సెక్షన్ కింద అక్రమ కేసులు నమోదు చేస్తారని ప్రశ్నించారు. ప్రశాంతమైన నియోజకవర్గం ఎవరి వలన నాశనం అయిందో అందరికీ తెలుసన్నారు. కట్టువపల్లిలో తమపార్టీ హయంలోనే అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు ఏమి లేదన్నారు. ఇల్లు కట్టిస్తామని చెప్పి ఉన్న ఇల్లు పడగొట్టి ఒక్క ఇల్లు నిర్మించలేదన్నారు. గడ్డపారతో దాడి చేయ డానికి ప్రయత్నించిన వారికి అండగా నిలవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో సోమిరెడ్డికి 30వేల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నూనె లక్ష్మయ్య, గాలి రామకృష్ణరెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, వెడిచర్ల వెంకటరమణరెడ్డి, చిట్టిబాబు, బండికట్టు రవీంద్ర, కలికి సుదీర్‌రెడ్డి, రాజాగౌడ్, చల్లగిరి ప్రసాద్, మధునాయుడు, సుమంత్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 29:** పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ నాయకులు ప్రధాన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లాల, నియోజకవ ర్గాల ఇన్‌చార్జులను కలసి ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతున్నామన్నారు. టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం అధ్యక్షులు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వీవీ శేషులు, జీవీ చలపతి శర్మ, ఎంసీ అచ్చయ్య, ఏ మురళీధర్ రావు, కే నాగిరెడ్డి, ఎన్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

## బీఓబీ శాఖ ప్రారంభం

**నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 29 :** నగరంలోని చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) శాఖను ఆ బ్యాంకు జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోనల్ హెడ్ రితేష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. బీఎం కేలం చెన్నాంజనేయులురెడ్డి మాట్లాడుతూ బృందావనంలో ఉన్న తమ బ్రాంచిని ఖాతాదారుల సౌకర్యార్థం చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతానికి మార్చామని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం ఎంవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల అధికారులపై చర్యలు తీసుకోవాలి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 29:** విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వ వసతి గృహ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్) రాష్ట్ర అధ్యక్షుడు వీవీఎస్ చైతన్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అంశంపై నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వీపీఆర్‌ను కలిసిన కిర్రాక్ ఆర్పీ

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 29:** రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని టీవీ షో జబర్దస్త్ ఫేం కిర్రాక్ ఆర్పీ గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కరోనా కాలంలో కిర్రాక్ ఆర్పీ చేసిన సేవలను వీపీఆర్ అభినందించారు.

## నేటి నుంచి శివలీలా తరంగిణి సప్తాహం

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 29 :** శివరాత్రి మహోత్సవాల సందర్భంగా పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వతేదీ వరకు శివలీలా తరంగిణి సప్తాహం జరుగుతుందని పరిషత్ అధ్యక్షుడు పోలవరపు లక్ష్మీనరసింహరావు, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో జరుగుతుందని తెలిపారు. తొలిరోజు క్షీరసాగర మథనంపై సహస్రావధాని కోట రాజశేఖర్ ప్రవచిస్తారని, శనివారం దక్షయజ్ఞంపై అగస్త్యరాజు సుబ్బారావు, 3వతేదీ భక్త శిరియాళ్‌పై సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు, శివతత్వంపై 4వతేదీ పోలవరపు లక్ష్మీనరసింహరావు, 5వతేదీ తిప్పడి కథపై చీమకుర్తి వెంకటేశ్వరరావు, 6వతేదీ గుణనిధి కథపై కొండేపి మురళీకృష్ణ, 7వతేదీ పార్వతీ కల్యాణంపై సూరం చంద్రశేఖర్ ప్రవచనం చేస్తారని తెలిపారు. భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

## 7న మైండ్ గేమ్ సినిమా విడుదల

**నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 29 :** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న మైండ్ గేమ్ సినిమా విడుదల చేస్తున్నట్లు ఆ చిత్రం దర్శకుడు కిషోర్ శ్రీకృష్ణ తెలిపారు. గురువారం ఆ చిత్ర బృందం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడింది. శ్రీలక్ష్మీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నెల్లూరు పరిసరాల్లోనే చిత్రీకరించామని చెప్పారు. సినిమా పోస్టర్లు ఆవిష్కరించారు. కుటుంబ సమేతంగా చూసి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీరామ్, హీరోయిన్లు మిధునప్రియ, విజయలక్ష్మి, నటీనటులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

**కొడవలూరు ఫిబ్రవరి 29:** మండలంలోని కొడవలూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కరీమ్ (24) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మాజీ శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కరీమ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్ర, పంది శ్రీనివాసులు, జిలానీ బాషా, నాయబ్ రసూలు తదితరులు ఉన్నారు.

### ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| నెల్లూరు ఏసీఎం | 9985411424 |
| నెల్లూరు ఏసీవో | 9542727676 |
| నెల్లూరు సిటీ | 8179815202 |
| నెల్లూరు రూరల్ | 8885688410 |
| కోవూరు | 8008894200 |

## పాఠశాల మరుగుదొడ్డిలో నాగుపాము



లెట్రిన్ బేసిన్‌లో ఉన్న పాము

కోట మండలం ఉత్త మనెల్లూరు పంచాయతీ పరిధిలోని తాటిగుంటచెరువు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల మరుగుదొడ్డిలో గురువారం ఓ నాగుపాము ప్రత్యక్షమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో ఓ మరుగుదొడ్డిలోని బేసిన్‌లోకి నాగుపాము చొరబడింది. ఇంటర్వెల్ సమయంలో హెచ్‌ఎం సుజాత ఆ పామును గమనించారు. వెంటనే విద్యార్థులను తరగతి నుంచి బయటకు రానీయకుండా తలుపువేసి స్థానిక గిరిజనులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి గంటసేపు కష్టపడి ఆ పామును అక్కడి నుంచి తరిమివేశారు. దీంతో విద్యార్థులు, టీచర్లు ఊపిరిపీల్చుకున్నారు. పామును గమనించకుండా ఎవరైనా వెళ్లి ఉంటే ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. -కోట

## కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుపతిలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా మూషిక వాహనంపై వినాయక స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. నేటినుంచి 10రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు నేటి ఉదయం 7.40 గంటలకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంసవాహన సేవ జరగనున్నాయి. - తిరుపతి (కల్చరల్)

## కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఉదయం ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా గరుత్మంతుడిని కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ శేషాచార్యులు అధ్వర్యంలో పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. రాత్రి వాహన సేవలు ప్రారంభమయ్యాయి. పెద్దశేష వాహనంపై కృష్ణావతారంలో వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. - చంద్రగిరి



# వైసీపీలో వర్గపోరు

**మట్టి అక్రమ తవ్వకాలతో పరస్పర దాడులు**

**చొక్కాలు చింపుకున్న ఇరు వర్గాల నాయకులు**

పెళ్లకూరు, ఫిబ్రవరి 29: వైసీపీలోని రెండు వర్గాల మధ్య రోజు రోజుకూ మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా కుంపటి రాజుకుంటోంది. గురువారం సాయంత్రం బంగారంపేట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుండగా మోదుగులపాలెం గ్రామానికి చెందిన సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి వచ్చి అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బంగారంపేటకు చేరుకున్నారు. 'నీవెవ్వరని మట్టి తోలకాలను అడ్డుకోవడానికి' అంటూ బెదిరించడంతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇద్దరి చొక్కాలు చిరిగిపోయాయని స్థానికులు తెలిపారు. మరోవైపు సత్యనారాయణరెడ్డికి మద్దతుగా జనం పోగవడం, పొద్దుపోవడంతో శేఖర్‌రెడ్డి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇది తెలిసి చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి రాత్రి తొమ్మిది గంటలకు శేఖర్‌రెడ్డికి మద్దతుగా నాలుగు కార్లలో వచ్చారు. అయితే వీరిని వాహనాలు దిగనీయకుండా మోదుగులపాలెం వద్దకెళ్లి సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో అడ్డుకున్నారు. అప్పటికే వివాదం పెద్దది అవడంతో బాలచంద్రారెడ్డి, దబ్బల అనుచరులు కూడా రాత్రి 9.30 గంటలకు సంఘటనా స్థలానికి తరలివచ్చారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

### నాయుడుపేట సీఐ కార్యాలయానికి పంచాయితీ

నాయుడుపేట టౌన్: ఈ పంచాయితీ కాస్తా నాయుడుపేట సీఐ కార్యాలయానికి చేరుకుంది. పరస్పరం ఫిర్యాదులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. శేఖర్‌రెడ్డి రాత్రి 11.30 గంటలకు సీఐ కార్యాలయానికి చేరుకున్నారు. సత్యనారాయణరెడ్డి మాత్రం రాలేదు. అయితే ఈయన్ను శుక్రవారం ఉదయం రావాలని పోలీసులు సూచించినట్లు తెలిసింది.



మోదుగులపాలెం వద్ద చెరువు కట్ట సమీపంలో గుమికూడిన వైసీపీ శ్రేణులు

## షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు



రాకెట్ పరికరాలతో వెళ్తున్న వాహనం

రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు గురువారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)కు చేరాయి. కేరళలోని తిరువనంతపురం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నుంచి భారీ భద్రత నడుమ రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో వీటిని తీసుకొచ్చారు. - సూళ్లూరుపేట

# ప్రత్యేకహోదాయే ప్రధానాస్త్రం



- నేడు తిరుపతిలో కాంగ్రెస్ భారీ బహిరంగసభ
- పదేళ్ళ కిందట మోదీ హామీలిచ్చిన చోటే నిర్వహణ
- సచిన్ పైలెట్, షర్మిల తదితర ప్రముఖుల హాజరు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగసభ నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేపట్టింది. ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో నేటి సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగసభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల,రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరుకానున్నారు. దీనికోసం సచిన్ పైలెట్ బెంగుళూరు నుంచీ షర్మిల హైదరాబాదు నుంచీ విమానాల్లో తిరుపతి చేరుకోనున్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో నిర్వహించిన బహిరంగసభలో నరేంద్ర మోదీ బీజేపీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో బీజేపీ సభ నిర్వహించిన ఎస్వీయూ స్టేడియంలోనే ఇపుడు కాంగ్రెస్ పార్టీ కూడా బహిరంగసభ ఏర్పాటు చేస్తోంది. అదే చోట సభ జరిపి మోదీ హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు హామీల అమలుపై మోదీని కాంగ్రెస్ నేతలు నిలదీయనున్నారు. వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇదివరకే తిరుపతిలో సమావేశం నిర్వహించినప్పటికీ అది పార్టీ అంతర్గత సమావేశం. బహిరంగ సభ జరపడం మాత్రం ఇదే తొలిసారి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో తొలి బహిరంగ సభ కావడంతో దీన్ని ఎలాగైనా విజయవంతం చేయాలని పార్టీ నాయకులు శ్రమిస్తున్నారు. 30 వేలమందితో సభ జరపాలని, దానికోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జనసమీకరణ చేయాలని ప్రయత్నిస్తున్నారు. బహిరంగ సభా స్థలిలో ఏర్పాట్లను గురువారం పీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ నేత తులసిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## వైసీపీ కోటకు వేమిరెడ్డి బీటలు

- వీపీఆర్ వెంట టీడీపీలోకి భారీగా వలసలు



నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ నిట్టనిలువునా చీలనుంది. కుట్ర పూరిత రాజకీయాలను తట్టుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) భారీస్థాయిలో ఆ పార్టీ నాయకులను తనవెంట తీసుకెళుతున్నారు. మార్చి 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు సమక్షంలో వీపీఆర్ దంపతులు టీడీపీలో చేరనున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే స్థాయి కలిగిన నాయకుల నుంచి డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల నాయకులు వందలాదిమంది టీడీపీలో చేరనున్నారు.వైసీపీకి వీపీఆర్ రాజీనామా చేసిన మరుసటి రోజు నుంచే వైసీపీలో అలజడి పెరిగింది. రోజూ వైసీపీకి చెందిన కీలక నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, సూళ్లూరుపేట, గూడూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి పలువురు కీలక నాయకులు మార్చి 2న టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ చేరికలతో టీడీపీ మరింత బలపడటంతోపాటు వైసీపీ కోటకు బీటలు వారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**7న గూడూరు,వెంకటగిరిల్లో లోకేష్ శంఖారావం**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'శంఖారావం' సభలను మార్చి 7వ తేదీన మధ్యాహ్నం గూడూరు, సాయంత్రం వెంకటగిరి నియోజకవర్గాల్లో నిర్వహించనున్నారు. 5వ తేదీ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో లోకేష్ పర్యటన ప్రారంభం కానుంది.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

**63,055మంది విద్యార్థులకు 87 కేంద్రాలు**

**మూడు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ప్రథమ సంవత్సర విద్యార్థులకు లాంగ్వేజ్ పేపర్-1పరీక్ష జరగనుంది. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 9-12గంటల మధ్య జరిగే ఈ పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్‌ఐవో ప్రభాకరరెడ్డి తెలిపారు. కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ఇంటర్ బోర్డుతో పాటు ప్రాంతీయ ఇంటర్ బోర్డు కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్స్‌కు అనుసంధానం చేసి, పర్యవేక్షించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.సమస్యాత్మక కేంద్రాలైన నాగలాపురం, పిచ్చాటూరు, చిన్నగొట్టిగల్లు కళాశాలల్లో రోజూ సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందని, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని వివరించారు. ప్రాథమిక వైద్య చికిత్స నిమిత్తం ఏఎన్ఎం అందుబాటులో ఉంటారని, పరీక్షలు జరిగే రోజు విద్యార్థులు ఆర్టీసీ బసులో ఉచిత ప్రయాణం చేసే వెసులుబాటు ఉందన్నారు.పరీక్షలకు 87 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో కలిపి 63,055మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని, హాల్‌టికెట్ చూపిన విద్యార్థులందరినీ అనుమతించాలని ఆర్‌ఐవో తెలిపారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్‌ఐవో కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబరు 0877-2237200కి ఫోన్ చేయాలని కోరారు.

## శివరాత్రి ఉత్సవాల్లో సామాన్యులకే పెద్దపీట



సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ముక్కంటి ఆలయంలో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథి భవనంలో గురువారం పలు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులను గత ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు.ఈ ఏడాది అత్యవసర సేవలపై నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు.బాల్య వివాహాల నిర్మూలనకు రెవెన్యూ, ఐసీడీఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఉత్సవాల సమయంలో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహించాలని వైద్యశాఖను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని పురపాలక శాఖను, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక వాహనం, 108 వాహనం ఆలయం వద్దనే నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై ఎస్పీ మలిక గార్గ్ పలు సూచనలు చేశారు.గత ఏడాది ఉత్సవాల్లో బందోబస్తును పర్యవేక్షించిన సీఐ అంజుయాదవ్ సమావేశానికి హాజరై క్యూలైన్ల విధానం, రద్దీ రోజుల్లో బందోబస్తు నిర్వహణ, రథోత్సవం, తెప్పోత్సవంలో చోరీలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.అవంతా విన్న ఎస్పీ ఈ ఏడాది అమలు చేయాల్సిన ఏర్పాట్లపై ఆలయంలో తిరిగి కసరత్తు చేశారు.ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో రవిశంకర రెడ్డి, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్, ఎస్పీ ఆలయాని కెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.నిత్యాన్నదానంలో కలెక్టర్ భక్తులతో కలిసి భోంచేశారు.

## రేషన్ దుకాణాల్లో రాగిపిండి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రేషన్ దుకాణాల్లో రాగిపిండి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులను దృష్టిలో ఉంచుకుని బియ్యంతో పాటు చౌకదుకాణాల్లో రాగిపిండిని పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాగిపిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.40 ఉండగా చౌకదుకానాల్లో కేవలం రూ.11కే అందిస్తున్నట్లు వెల్లడించారు.శుక్రవారం నుంచి కేజీ నుంచి మూడు కేజీల వరకు బియ్యానికి బదులుగా రాగిపిండి ఇస్తున్నట్లు తెలిపారు.

# అంతా అయ్యాక అనుమతులు!

- టీటీడీ ఉద్యోగుల లేఅవుట్‌కు వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ
- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో ఏదైనా లే అవుట్ వేయాలంటే నివాసయోగ్యమైన స్థలంగా ప్రభుత్వం దగ్గర మార్చుకోవాలి. ఆ తర్వాత స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ అప్రూవల్ తీసుకోవాలి. అప్పుడే ప్లాట్లను విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కానీ టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట దగ్గర ఇచ్చిన ప్లాట్లకు మాత్రం ఇలాంటి నిబంధనలు ఏమీ వర్తించలేదు. ఎలాంటి అనుమతులూ లేకుండానే పేపర్‌పై స్కెచ్ వేసి, లాటరీ తీసి నెంబర్లు కేటాయించేశారు.అంతేకాదు కొందరికి రిజిస్ట్రేషన్ తంతు కూడా పూర్తిచేశారు. అంతా అయ్యాక ఇప్పుడు భూమి మార్పుకోసం అందులోని ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకున్నారు.ఈ మేరకు గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగపు ముఖ్యకార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. వడమాలపేట మండలం, పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ జరగలేదు. ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దాదాపు రూ.5.5కోట్లు తుడాకు టీటీడీ చెల్లించింది. దీంతో రెసిడెన్షియల్‌గా మార్పు చేయడంతో పాటు సదరు స్థలంలో 60 మీటర్ల తుడా ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా రద్దుచేస్తూ శ్రీలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు.దీనితర్వాత మళ్లీ లే అవుట్ అప్రూవల్ తీసుకోవాల్సివుంది.సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రైవేట్ సంస్థలకు అన్ని అనుమతులూ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తారు. మరి అనుమతులు లేకుండా టీటీడీ ఉద్యోగులకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు ఎంతవరకు చెల్లుబాటవుతాయన్న ఆందోళన ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

## ఆస్తి కోసం తమ్ముడినే చంపేశాడు!

- పులిబోనువారిపల్లెవాసి హత్య కేసులో సోదరుడు సహా నలుగురికి రిమాండ్



హతుడు చంద్రశేఖర రెడ్డి (పాత చిత్రం)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29: ఆస్తి కోసం అన్నే తన కుమారుడితో కలిసి తమ్ముడిని దారుణంగా నరికి చంపేశాడని పోలీసులు నిర్ధారించారు. తిరుపతి రూరల్ మండలం కాలూరు క్రాస్ వద్ద ఈనెల 25న జరిగిన చంద్రశేఖర రెడ్డి (50) హత్య కేసులో నలుగురు నిందితులను రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన భాస్కరరెడ్డి కుమారులు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి(50)కి నడుమ ఆస్తి తగాదాలున్నాయి. రౌడీషీటరైన రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటుండగా చంద్రశేఖరరెడ్డి స్వగ్రామంలోనే నివసిస్తున్నాడు. చంద్రశేఖరరెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఈనెల 25న ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వచ్చాడు.పిల్లలు తినుబండారాలు కావాలనడంతో బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు పురుషోత్తంరెడ్డి, అతని స్నేహితులు యోగి, చింతకాయల వీధికి చెందిన మరో మైనర్ బాలుడు కలిసి చంద్రశేఖరరెడ్డిపై దాడి చేశారు. బైక్ పైనుంచి కిందపడిపోయిన చంద్రశేఖరరెడ్డి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో నరికి చంపారు.మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు గురువారం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. రామ్మోహన్‌రెడ్డిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసులున్నాయి.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## పులికాట్ పరిసరాల్లో మడ చెట్లు పెంచాలి


మడ అడవులపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 29: పులికాట్ సరస్సు పరిసరాల్లో మడ చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని డీఎఫ్‌వో శామ్యూల్ అన్నారు. గురువారం అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో వైజాగ్‌కు చెందిన అటవీ పరిశోధన, తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థా కేంద్రం (ఎఫ్ఆర్ సీఈసీ) బృందం వారు అటవీశాఖ అధికారులు, సిబ్బందికి మడ అడవులపై అవగాహన కల్పించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ వాకాడు మండల కొండూరు పాలెం వద్ద మడచెట్ల పెంపకానికి ఎఫ్ఆర్‌సీఈసీ వారు ముందుకొచ్చారన్నారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రకాష్, రాజు, ఎఫ్ఆర్‌సీఈసీ సిబ్బంది శ్రీనివాస్, గణేష్, గాయిత్రి, అనూష, శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర


గూడూరులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడానికి ప్రజా పోరుయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు తెలిపారు. గురువారం రెండోపట్టణ పరిధిలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందన్నారు. భైరప్ప, పనబాక కోటేశ్వరరావు, గాలి ప్రకాష్‌నాయుడు, గిరిధర్‌రెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

**తడ:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి విజయభాస్కర్, మండల కన్వీనర్ రాచర్ల కృష్ణమూర్తి, నేతలు మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించాలని దరఖాస్తు

గూడూరు, ఫిబ్రవరి 29: గూడూరు అసెంబ్లీకి లేదా తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ తరఫున టిక్కెట్ కేటాయించాలని గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం సంస్థ అధ్యక్షుడు రవిరాఘవేంద్ర తెలిపారు. తమ సంస్థ ద్వారా గూడూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేసినట్లు వివరించారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి


సమావేశంలో ఎంపీపీ, అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 29: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. జడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఇన్‌చార్జి ఎంపీడీవో మురళి, ఇంద్రారాణి, ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి భూ సమస్య పరిష్కరించాలి


మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పవన్

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: భైరవరం గ్రామానికి చెందిన కడిమి సుబ్బమ్మ అనే వృద్ధురాలి భూ సమస్యను పరిష్కరించాలని మార్పు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి పవన్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కొనుగోలు చేసిన భూమికి పాసుపుస్తకాలు మంజూరు చేయాలని సుబ్బమ్మ 30 ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఆయనవెంట బాధితురాలు సుబ్బమ్మ ఉన్నారు.

## పదవీ విరమణ సన్మానం


గిరినాథ్, రవీంద్రకుమార్‌లను అభినందిస్తున్న అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడం ద్వారా ప్రజల నుంచి గుర్తింపు పొందుతారని డీపీఆర్ ఈవో శంకరనారాయణ అన్నారు. గురువారం డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో పంచాయతీరాజ్‌శాఖ ఈఈగా గిరినాథ్, డీఈగా రవీంద్రకుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరిద్దరూ పీఆర్‌శాఖలో మంచిపేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో సుభాష్‌బాబు, శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవికుమార్, షౌకత్‌హుస్సేన్, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని 24వ వార్డులో బీజేపీ వెంకటగిరి ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం నిర్వహించారు. ముని సుబ్రహ్మణ్యం, వెంకట రమణయ్య, రవిబాబు, బాలకృష్ణ, లక్ష్మి, రత్నం, వెంకటరత్నం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆప్‌తోనే సంక్షేమం

నాయుడుపేట, ఫిబ్రవరి 29 : ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్)తోనే సంక్షేమం, అభివృద్ధి లభిస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో గురువారం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా ప్రచారం చేపట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా కన్వీనర్ పులి మానస, మోహన్‌రాజు, రాజేష్, మాససా, రమణ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేది మా ప్రభుత్వమే: వైసీపీ

వాకాడు, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో మళ్లీ తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వాకాడు మండలంలోని తన నివాసం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ.. సిద్ధం సభలు విజయవంతం అయ్యాయన్నారు. ఆయనవెంట కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, షనీల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,784 మంది తలనీలాలు సమర్పించారు.



## వైసీపీని సాగనంపుదాం: జనసేన


ఎగిలాంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని పిగిలాం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, జనంలోకి జనసేన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పగడాల వెంకటరమణయ్య, పోలేపల్లి శ్రీనివాసులు, పోలేపల్లి కృష్ణ, ప్రసన్నకుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

బాలాయపల్లి, ఫిబ్రవరి 29: జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న దండు రవీంద్రారెడ్డి గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, స్థానికులు సన్మానించారు.

# టీడీపీ శ్రేణుల్లో జోష్

### వైసీపీ నుంచి చేరికలు పెరుగుతుండటమే కారణం

గూడూరు, ఫిబ్రవరి 29: గూడూరు నియోజకవర్గ పరిధిలో వైసీపీ నుంచి తమ పార్టీలోకి చేరికలు పెరుగుతుండటంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. నియోజకవర్గంలోని ఎక్కువగా ఉండే రెడ్డి సామాజిక వర్గమూ ప్రస్తుతం టీడీపీ వైపే చూస్తోంది. ఎందుకంటే నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) శనివారం నెల్లూరులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. దాంతో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రెడ్డి సామాజిక ప్రధాన నాయకులు వీపీఆర్‌ని కలిసి మంతనాలు సాగించి ఆయనతోపాటు టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దశరథరామిరెడ్డి వీపీఆర్‌తోపాటే టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, వైసీపీ ప్రధాన నాయకులు శ్రీనివాసులురెడ్డి, మురళీరెడ్డి తదితరులు కూడా వీపీఆర్ సమక్షంలోనే టీడీపీలో చేరనున్నారు. గురువారం గూడూరుకు చెందిన వైసీపీ రాష్ట్ర నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి నెల్లూరులో వీపీఆర్‌ని కలిశారు. ఈయన కూడా టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. చిల్లకూరు, వాకాడు మండలాల నుంచి కూడా పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రధాన నాయకులు టీడీపీలోకి చేరనున్నారు. వీరి రాకతో తమకు మరింత పట్టు పెరుగుతుందని టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## టీడీపీవైపే అందరి చూపు: పాశం


పాశం సునీల్‌కుమార్‌తో చెన్నూరు వైసీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 29: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పలువురు వైసీపీకి రాజీనామాలు చేసి తమ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం చెన్నూరు గ్రామంలో వైసీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏఎంపీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ వైసీపీ కార్యదర్శి శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్లమెంట్ సేవాదళ్ కార్యదర్శి మురళీరెడ్డితోపాటు సుధాకర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి తదితరులు వైసీపీకి రాజీనామాలు చేశారన్నారు. త్వరలోనే వీరంతా టీడీపీలోకి చేరుతారన్నారు. ఈ సమావేశంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం మురళీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గూడూరు టీడీపీ కార్యాలయంలో రెండో పట్టణానికి చెందిన పలువురు యువత పార్టీలో చేరారు. వీరికి పాశం, టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అబ్దుల్‌రహీం, సురేష్, నాని, మహేష్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, అమరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### శంఖారావాన్ని విజయవంతం చేయాలి

నియోజకవర్గ పరిధిలో మార్చి ఏడో తేదీన నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరగనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, పురుషోత్తంరెడ్డి, గణపర్తి కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయండి

### టీడీపీ అభ్యర్థి పరిచయ సభలో నెలవల

పెళ్లకూరు, ఫిబ్రవరి 29: టీడీపీ విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నెలవల విజయశ్రీ ఎంపికయ్యాక తొలిసారిగా కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయుడుపేట-పెళ్లకూరు సరిహద్దు ప్రాంతమైన గోమతి


టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో నెలవల, విజయశ్రీ

సెంటర్ నుంచి కొత్తూరు వరకు 14 కిలోమీటర్లు 71వ జాతీయ రహదారిపై బైకుల ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నెలవల మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎనికల్లో విజయశ్రీకి భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, రాష్ట్ర, జిల్లా సర్పంచుల సంఘం నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కందమూడి శివకుమార్, నాయకులు నెలవల రాజేష్, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, దార్ల రాజేంద్ర, దామెర ప్రసాద్‌నాయుడు, రామకృష్ణ, నరేంద్రయాదవ్, సిద్దులయ్య, వాసు, తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ విజయానికి కృషి చేయండి

**నాయుడుపేట టౌన్:** టీడీపీ విజయానికి కృషి చేయాలని సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి విజయశ్రీ సూచించారు. మడపలం గ్రామంలో గురువారం సాయంత్రం టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డితోపాటు గ్రామస్తులను ఆమె సన్మానించారు. టీడీపీ నాయకులు దార్ల రాజేంద్ర, సుజాతమ్మ, నెలవల రాజేష్, పార్థసారథి, తదితరులున్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఎస్‌కేఆర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు

గూడూరు, ఫిబ్రవరి 29: పట్టణంలోని ఐదు కేంద్రాల్లో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్వర్ణాంధ్రభారతి, సెయింట్ మేరీస్, డీఆర్‌డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు పరిశీలించారు.

**నాయుడుపేట:** ఎస్‌పీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 350 మంది, ఎల్ఏసాగరంలోని బాలుర గురుకులంలో 450 మంది, శ్రీవేమ కళాశాలలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికోసం అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

### తల్లిదండ్రులకు పాదాభివందనం



పుదూరులో బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు కన్నవారి దీవెన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రూత్‌రమోలా నిర్వహించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులు పద్మజ, శశికళ, సునీత, విజయలక్ష్మి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

### విద్యాసామగ్రి వితరణ

నాయుడుపేట, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న దృష్ట్యా జూనియర్ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు అమ్మా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బందిలమోహన్ విద్యాసామగ్రిని గురువారం వితరణ చేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

## దాహార్తి తీరేదెప్పుడు?



సిద్ధమైన సంపు, వాటర్ ట్యాంక్ - తాగునీటిని కొనుగోలు చేస్తున్న అంజలాపురం మహిళలు


వాకాడు, ఫిబ్రవరి 29: దుగరాజపట్నం పంచాయతీ పరిధిలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు 2021లో రూ.93 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా 12 కిలోమీటర్ల పైపులైన్, వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు చేపట్టారు. పైపులైన్, ట్యాంక్ పూర్తయ్యింది. పైపులైన్ దూరం కావడంతో సంపు ఏర్పాటు చేసి మోటర్లతో ట్యాంక్‌లోకి నీటిని నింపి టెస్టింగ్ కూడా చేశారు. అయినా తాగునీటి సరఫరా జరగడం లేదు. దాంతో గ్రామస్తులు నీటిని కొనుగోలు చేసి తాగాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌చౌదరిని వివరణ కోరగా.. కొండూరుపాళెంలో సంపు, వాటర్‌ట్యాంక్ పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. ట్యాంక్ లీకేజీలు లేకుండా టెస్టింగ్‌లు కూడా చేశామన్నారు. ట్యాంకుకు రంగులు వేసి మరోవారం రోజుల్లో నీటిని విడుదల చేస్తామన్నారు.

## తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 29: గోవిందరాజస్వామి ఆలయంలో భక్తులకు నిత్యాన్నదాన పథకాన్ని టీటీడీ గురువారం ప్రారంభించింది. ఉత్తరమాడవీధిలోని పాత మ్యూజియం ఆవరణలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఈ కార్యక్రమానికి లాంచనంగా శ్రీకారం చుట్టారు. భక్తులకు అన్నం వడ్డించిన అనంతరం భూమన మాట్లాడుతూ తిరుమలలో రోజూ లక్షమంది భక్తులకు టీటీడీ అన్నప్రసాదం అందిస్తోందన్నారు. అలాగే తిరుచానూరు అమ్మవారి ఆలయాన్ని సందర్శించే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నప్రసాదం అందిస్తున్నామన్నారు. ఇటీవలే ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలోనూ ప్రారంభించామన్నారు. ఇదే రీతిలో గోవిందరాజస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రతిరోజూ ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు వేల మందికి నిత్యాన్నదానం ఏర్పాటు చేశామన్నారు. తిరుమల పెద్ద జియ్యర్, చిన్నజీయ్యర్, జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో టి.రవి, డిప్యూటి ఈవో శాంతి పాల్గొన్నారు.

### కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అంకురార్పణ సందర్భంగా సాయంత్రం మూషిక వాహనంపై వినాయక స్వామిని పురవీధులలో ఊరేగించారు. శుక్రవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు మొదలువుతాయి. ఉదయం 7.40నుంచి మీన లగ్నంలో ధ్వజారోహణం, 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహన సేవ ఉంటాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు.

## పదేళ్లలో దేశంలో అత్యద్భుత ఆవిష్కరణలు / కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి


సదస్సులో సతీష్‌రెడ్డి, వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: గడిచిన పదేళ్లలో దేశంలో ఎన్నో అత్యద్భుత ఆవిష్కరణలు జరిగాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిల భారత శిక్షక్ మహా సంఘ్(ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆత్మనిర్భర భారత్ - సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో పదేళ్లలో ఎన్నో గొప్ప పనులు జరిగాయన్నారు. ఆ రంగంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనమన్నారు. నూతన ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడటం చాలా వరకూ తగ్గిందన్నారు. తద్వారా రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని విశ్వగురువుగా నిలిపే బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఇందుకు అవసరమైన బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం చివరికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ నేత లక్ష్మణ్ మాట్లాడారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి పాల్గొన్నారు.

## రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమాన్ని శనివారం ఉదయం తిరుమలలో నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. దీనికోసం 0877-22630261ను సంప్రదించాల్సి ఉంటుంది.

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుదర్శన యాగంలో రిషబ్‌శెట్టి


వైసీపీ కార్యాలయంలో జరిగిన యాగంలో రిషబ్‌శెట్టికి వేద పండితుల ఆశీర్వాదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ఎన్నికల్లో మరోసారి గెలవాలని కోరుకుంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి గురువారం సుదర్శన యాగం నిర్వహించారు. శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయంలో జరిగిన ఈ హోమానికి కన్నడ నటుడు,కాంతర ఫేం రిషబ్ శెట్టి హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన ఆయన దర్శనానంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఫోటోలు మీడియాకు పంపడంతో యాగం విషయం వెలుగులోకి వచ్చింది.

## రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

### ఏ మొహం పెట్టుకుని ప్రజల్ని ఓట్లు అడుగుతాడు: కురుగొండ్ల


మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 29: రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సీఎం జగన్.. ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతాడని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రశ్నించారు. గురువారం తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ నేతల అరాచకాలు పెరిగిపోయాయని విమర్శించారు. శిశుపాలుడు వంద తప్పులు చేస్తే జగన్ వెయ్యిన్నొక్క తప్పు చేశారని అన్నారు. వైసీపీ నేతల వేధింపులు తట్టుకోలేక అంతర్ జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహారి పారిపోయాడని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభకు వచ్చిన జనాన్ని చూసి తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదిలాయని తెలిపారు. పులివెందులలోనే జగన్ ఓడిపోబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యం, చంద్రారెడ్డి, చలపతి, మంకు ఆనంద్, మచ్చల వేణు, కూన శ్రీహరి, సుధ తదితరులు పాల్గొన్నారు.

## 21 బాటిళ్ల మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

తడ, ఫిబ్రవరి 29 : ఎన్ఎంకండ్రిగ గ్రామంలో మద్యం అక్రమంగా అమ్ముతున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి పోలీసులు తొప్పాని సుధాకర్ ఇంటి పరిసరాల్లో తనిఖీ చేశారు. 21 బాటిళ్ల మద్యం కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

## 3 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో అధికారులు

వెంకటగిరి, ఫిబ్రవరి 29: మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వినయ్‌కుమార్ గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండులో తమిళనాడుకు చెందిన ఖాజా మొహిద్దీన్ షేక్ మన్సూర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతడి వద్ద మూడు కిలోల గంజాయి బయటపడింది. దీన్ని రాజమండ్రికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నుంచి కిలో రూ.3వేల వంతున కొనుగోలు చేసి, చెన్నైలో విక్రయించడానికి తీసుకెళుతున్నట్లు గుర్తించారు. దాంతో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది ఎస్ఐ మహబూబ్ వలి, సిబ్బంది రసూల్, వేణుగోపాల్, పుట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## లైన్‌మ్యాన్‌పై దాడి

తడ, ఫిబ్రవరి 29: కరెంట్ బిల్లు కట్టలేదని అడిగినందుకు లైన్‌మ్యాన్‌పై ఓ వ్యక్తి దాడిచేశాడు. పన్నంగాడుకు చెందిన పూజారి ఆర్ముగం రెండు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీనిపై ఆయన ఇంటికి లైన్‌మ్యాన్ డి.ప్రభాకర్ గురువారం వెళ్లి.. బిల్లు విషయమై అడిగాడు. సరైన సమాధానం రాకపోవడంతో కనెక్షన్ కట్‌చేశాడు. కోపోద్రిక్తుడైన ఆర్ముగం ఆ లైన్‌మ్యాన్‌పై దాడి చేశాడు. ఈ విషయాన్ని ఏఈ మురళికి తెలియజేసి, ఆయన సమక్షంలో పోలీసులకు లైన్‌మ్యాన్ ఫిర్యాదు చేశారు.

## మసీదుల జీర్ణోద్ధరణకు సహకరిస్తాం


ముస్లిం పెద్దలకు నగదు అందజేస్తున్న వినోద్‌రెడ్డి

కోట, ఫిబ్రవరి 29: మసీదుల జీర్ణోద్ధరణకు సహకరిస్తామని వైసీపీ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. శ్యామసుందరపురంలోని ఈద్గా ప్రహరీ నిర్మాణానికి తన తండ్రి హరనాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.50వేలను వితరణ చేశారు. కోటలోని ఆయన నివాసంలో ఈ నగదును ఎంపీటీసీ మోబిన్ బాషా ఆధ్వర్యంలో గురువారం ముస్లిం పెద్దలకు అందజేశారు.

## నూతన ఆలయం ప్రారంభం


ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం

చిల్లకూరు, ఫిబ్రవరి 29: తూర్పుకనుపూరులో నూతనంగా నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని గురువారం ప్రారంభించి, శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, యంత్రస్థాపన పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్‌కుమార్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి లక్ష తులసీ పూజ



గూడూరు, ఫిబ్రవరి 29: బాలాజీ నగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం 15వ వార్షికోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం లక్షతులసీ పూజ, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు.